

నిష్పక్షపాత వార్తల నిలయం

# నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం



ఆదివారం 22-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 279 రూ॥ 6.00


# జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టులో పిటిషన్లు

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ దాఖాలు చేయాలని కోర్టు ఆదేశాలు

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి







- విభజన వెనుక కాంగ్రెస్ కుట్ర: బీజేపీ, బీఆర్ఎస్‌ల ఆరోపణ
- అధిక రెవెన్యూ వుండే ప్రాంతాలపై ప్రభుత్వ పట్టు కోసం యత్నం: విపక్షాలు
- బీఆర్ఎస్, బీజేపీ మూలాలను దెబ్బకొట్టే వ్యూహం
- ఎంఐఎంకు రేవంత్ ఇస్తున్న గిఫ్ట్ ఇది: బీజేపీ
- విభజన పుణ్యమాని ఇళ్లకు అనుమతులు రాక సామాన్యులు లబోదిబో
- విభజన పేరుతో ఆగస్టు వరకు ఎన్నికలు వాయిదా వేసే వ్యూహం
- స్పెషల్ ఆఫీసర్ల నియామకం వెనుక ఆలోచన ఇదే
- బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణ

**హైదరాబాద్, నేటిధాత్రి:**

తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 11న అధికారికంగా జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విడ గొట్టిన సంగతి తెలిసిదే. ప్రభుత్వం ఈ చర్య తీసుకున్న వెంటనే దీన్ని సవాలు చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ముఖ్యంగా ఈవిధంగా విభజించడానికి ఎంచుకున్న స మయం, వివిధ జోన్లకు నిర్ణయించిన సరిహద్దుల అంశాలను సవాలు చేస్తూ ఈ లిటిగేషన్లు దాఖల య్యాయి. ప్రభుత్వం జీహెచ్ఎంసీని వరుసగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొ రేషన్లుగా విడగొట్టింది. హైదరాబాద్ కింద శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లుండగా, సైబరాబాద్ పరిధిలో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖు త్బుల్లాపూర్ జోన్లు అదేవిధంగా మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలో మల్కాజ్‌గిరి, ఎల్‌బీనగర్, ఉప్పల్ జోన్లను ప్రభుత్వం చేర్చింది. స్పెషల్ సెక్రటరీ జయేష్‌రంజన్‌కు ఈ మూడు కార్పొరేషన్ల బాధ్యతను ప్రభుత్వం అప్పగిస్తూ ఈనెల 10న ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి వీలుగా 55వ నెంబరు జీవోను జారీచే సింది. ప్రస్తుతం ఈ జీవోను వ్యతిరే కిస్తూ పలు పిటిషన్లు హైకోర్టులో దాఖల య్యాయి. వీటిపై విచారణ జరుపుతున్న జస్టిస్ అపరేష్‌కుమార్, జస్టిస్ జి.ఎం. మొయునిద్దీన్‌లతో కూడిన దర్మాసనం ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. ఈనెల 19–20 తేదీల్లో అదనపు సొలిసిటర్ జనరల్ (కేంద్రం), అడ్వకేట్ జనరల్ (రాష్ట్రం)లకు దాఖలైన పిటీషన్లపై మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. అయితే విభజన ప్రక్రియను నిలుపుచేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి కోర్టు నిరాకరిస్తూ కేసు విచారణను మార్చి 25వ తేదీకి వాయిదా వేసింది. ప్రముఖ వ్యాపారవేత్త డి.గురవారెడ్డితో పాటు మరికొం దరు పిటిషన్ దారులు 55వ నెంబరు జీఓను వ్యతిరేకించడానికి కొన్ని కారణాలను స్పష్టంగా పేర్కొన్నారు.

2025 ఆగస్టు నెలలో రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియాలు 2027లో జనగణన పూర్తయ్యే వరకు న్యాయపరిధిలో మార్పులు చేయకుండా ఇచ్చిన "ఫ్రీజింగ్" ఆదేశాలను ఈ జీఓ ఉల్లంఘిస్తున్నది. వీటి ప్రకారం 2027 జనగణన పూర్తయ్యే వరకు మున్సిపల్ సరిహద్దుల్లో మార్పులు చేర్పులు చేయడానికి వీల్లేదు. దీన్నిబట్టి ఈ జీఓ సెన్సెస్ చట్టాన్ని అతిక్రమిస్తున్నట్టు స్పష్టమవుతోంది.

ఈ ఫ్రీజ్ ఆదేశాలు 2025 డిసెంబర్ 31 నుంచి అమల్లోకి రాగా, జనగణన పూర్తయ్యే వరకు అమల్లో వుంటాయి. అందువల్ల 2026 ఫిబ్రవరి నెలలో జీహెచ్ఎంసీని విభజిస్తూ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధం.

రాజ్యాంగంలోని 14, 19, 21 అధికరణాలను ఉల్లంఘించేదిగా వున్నందున్న తెలంగాణ మున్సిపాలిటీస్ సవరణ చట్టం–2026 రాజ్యాంగ విరుద్ధం.

మున్సిపల్ పరిధుల్లో మార్పులు చేసేటప్పుడు జనాభా, ఆదాయం వంటి అంశాలను పరిగణలోకితీసుకోవాలని, అంతేకాకుండా విభజన గురించి గవర్నర్ నోటిఫికేషన్ జారీచేయాలని అటువంటిదేమీ ఇక్కడ జరగలేదని పిటిషనర్లు వాదించారు. ఇది రాజ్యాంగంలోని 243క్యు అధికరణాన్ని ఉల్లంఘించడమేనని వారు తమ వాదనలో వివరించారు.

ఈ విభజన ప్రక్రియ రాజ్యాంగంలోని ఏ అధికరణాన్ని ఉల్లంఘించడంలేదని, ఇది జనగణకు ఏవిధంగాను అడ్డంకి కాజాలదని అడ్వకేట్ జనరల్ వాదించారు. అయితే ఈ విభజనను హైకోర్టులో సవాలు చేసినప్పటికీ, సైబరాబాద్ కమిషనర్‌గా జి.శ్రీజన, మల్కాజ్‌గిరి కమిషనర్‌గా టి.వినయ్‌కృష్ణారెడ్డిలు బాధ్యతలు స్వీకరించి కార్యాలయాల ఏర్పాటు వంటి కార్యక్రమాల్లో బిజీగా వుండటం విశేషం. ఫిబ్రవరి 11న పరిపాలనా పరంగా జీహెచ్ఎంసీని విభజిస్తూ రూపొందించిన మ్యాప్ ప్రకారం కమిషనర్లు తన పాలనా విధులను నిర్వర్తిస్తున్నారు.

ప్రస్తుతం జీహెచ్ఎంసీలో వున్న 300 వార్డులను మూడు కార్పొరేషన్ల పరిధిలోకి విడగొట్టారు. వీటిని ఒక్కో కార్పొరే షన్ పరిధిలోని జోన్లకిందికి చేర్చారు. ఉదాహరణకు హైదరాబాద్ కార్పొరేషన్‌లో చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్, షంషాబాద్ జోన్లుండగా వీటిల్లో ముఖ్యమైన ప్రాంతాలు జూబిలీహిల్స్, ముషీరాబాద్, అమీర్‌పేట్, ఫలక్‌నామా, బందన్‌పేట్‌లు. ఈ కార్పొరేషన్‌ను మొత్తం 150 వార్డులు, 30 సర్కిల్స్‌గా విడగొట్టారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కింద శేర్‌లింగంపల్లి, కూకట్‌పల్లి, ఖుత్బుల్లాపూర్ జోన్లుండ గా మాదాపూర్, మియాపూర్, నిజాంపేట్, కొంపల్లి, మేడ్చెల్‌లు కీలక ప్రాంతాలు. ఈ కార్పొరేషన్ పరిధిలో 76 వార్డులు, 16 సర్కిళ్లు వున్నాయి.

మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలో మల్కాజ్‌గిరి,ఉప్పల్,ఎల్బీనగర్ జోన్లుం డగా, అల్వాల్, కాప్రా,సరూర్‌నగర్, బోడు ప్పల్‌లు కీలక ప్రాంతాలు. ఇందులో మొత్తం 74 వార్డులు, 14 సర్కిల్స్ వు న్నాయి.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం,అశాస్త్రీయంగా చేస్తున్న విభజనగా ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా 2023 మున్సిపల్ ఎన్నికల్లో తాను దెబ్బతిన్న అర్బన్ ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని,ఈసారి ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు వీలుగా రేవంత్ ప్రభుత్వం ఈ విభజన చేపట్టిందనిబీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. ఇది కేవలం కుట్రపూరితంగా ఎంఐఎంకు ఇస్తున్న బహు మానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి. వివేకానందగౌడ్ మాట్లాడుతూ మేయర్‌ను, ఎన్నికైన కార్పొరేటర్లను సంప్రదించకుండా ఏకపక్షంగా రహస్యంగా తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం అప్రజాస్వా మికమని ఆరోపించారు. ఈ ప్రక్రియవల్ల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం వుంది. ప్రస్తుతం ఈ మూడుకార్పొరేషన్లు స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ ఆధీనంలో వున్నాయి. అయితే ఈ విభజన ప్రక్రి య పుణ్యమాని తమ ఇళ్లకు అనుమతులు రావడంలేదని ఉప్పల్, ఖుత్బుల్లాపూర్ ప్రాంత వాసు లు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా జోన్ల పరిధులు మారిపోవడంతో ఫైళ్లను తరలించే ప్రక్రి య కొనసాగడమే ఇందుకు కారణమని వారు చెబుతున్నారు.

జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్, బీజేపీలకు మంచి బలం వుంది. 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 56, బీజేపీ 48 సీట్లు గెలుచుకోవడమే ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యంలో ఈవిధంగా జీహెచ్ఎంసీని విడగొట్టడం ద్వారా ఇప్పటివరకు సువిశాలంగా వున్న ప్రాంతాలను చిన్నవిగా విడగొట్టడం వల్ల తనకు అనుకూలంగా వుంటుందని, ముఖ్యంగా సంక్షేమ పథకాలను ఒక పద్ధతి ప్రకారం అమలు చేయవచ్చునన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. జంటనగరాల్లో బీఆర్ఎస్‌బలంగా వుంది. ఫలితంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలోని 24 అసెంబ్లీ స్థానాల్లో కాం గ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. ప్రస్తుతం ఈవిధంగా విభజించడం ద్వారా, బీఆర్ఎస్ కోటలోకి చెట్టు వేళ్ల మాదిరిగా చొచ్చుకు పోవాలన్నది రేవంత్ వ్యూహం.

ఎంఐఎంకు ఈ విభజన ద్వారా కాంగ్రెస్ ఒక గిఫ్ట్‌ను ఇస్తున్నదని బీజేపీ ఆరోపిస్తోంది. ఉమ్మడి జీహెచ్ఎంసీలో ఎంఐఎం బలం 23%కు మాత్రమే విస్తరించివుంది. ఇప్పుడు హైదరాబాద్‌కు 150 వార్డులు కేటాయించడమంటే, ఎంఐఎంను కింగ్‌మేకర్‌గా చేయడం తప్ప మరోటికాదని బీజేపీ నేతల వాదన. అంతేకాదు ముస్లిం మెజారిటీ ప్రాంతాల్లో ఎంఐఎంకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడమే కాకుండా, కాంగ్రెస్, ఎంఐఎంలు కలిసి మేయర్ స్థానాన్ని కైవలం చేసుకోవడానికి నెంబర్‌గేమ్ ఆడటం చాలా సులువుగా మారనుందని వారు పేర్కొంటున్నారు. కాగా రెవె న్యూపరంగా అత్యంత విలువైన సైబరాబాద్‌పై ప్రభుత్వం తన నియంత్రణను కొనసాగించాలను కుంటోందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపిస్తున్నారు. చిన్న విస్తీర్ణంలో స్వతంత్రంగా వుండే ప్రాంతాలను చూపి కొత్త రుణాలు పొందవచ్చు. లేదా కొత్త గ్రోత్ కారిడార్లను అభివృద్ధి చేయనూ వచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన "ఫ్యూచర్‌సిటీ"కి తగిన ఊపు లభింపజేసేందుకోస మే ఈ విభజన అని, కొన్ని పోలీసు విభాగాలు, అభివృద్ధి పరిధి కలిగిన కొన్ని మున్సిపల్ ప్రాంతాలను ఇందులో కలిపేస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్న వ్యూహం కూడా వున్నదన్నఅభిప్రాయాలున్నాయి. అంతేకాదు, ప్రభుత్వం ఇప్పుడు విభజన ప్రక్రియను మొదలుపెడితే ఇది పూర్తయ్యే సరికి కొంత సమయం పడుతుంది. స్పెషల్ ఆఫీసర్‌ను నియమించడంలో ప్రధాన ఉద్దేశం ఇదే. పునర్మిర్మాణ ప్రక్రియ వల్ల పాలనాపరంగా ప్రభుత్వం ప్రతి ప్రాంతంలో తన ఉనికిని ప్రదర్శించగలదు. ఈ ప్రభావం ఓటర్లపై పడితీరుతుంది కనుక, ఈ ఏడాది ఆగస్టు వరకు ఎన్ని లు వాయిదా వేసే ఆలోచనతో ప్రభుత్వం వున్నదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.







నిజాన్ని నిర్భయంగా చెప్పేది నిజమే
# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక
21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం





ఆదివారం 22-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 279 రూ॥ 6.00


# పైకి కనిపించని బలంతో బీఆర్ఎస్

## కాంగ్రెస్ గెలుపు వెనుక దాగున్న అసలు నిజం




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


- బీఆర్ఎస్‌కు ఇంకా గట్టి పట్టు
- కాంగ్రెస్ విజయం అంకెల గారడీ మాత్రమే
- ఇప్పటికీ కాంగ్రెస్‌ను ఢీకొట్టే స్థితిలో బీఆర్ఎస్
- కేసీఆర్, రేవంత్‌లు తిట్ల పురాణంలో దిట్టలు
- ఎంత తిడితే అన్ని ఓట్లు పెరుగుతాయనే ట్రెండ్ పెరిగే ప్రమాదం
- రాష్ట్రంలో క్రమంగా తగ్గుతున్న తెలంగాణ సెంటిమెంట్
- పనితీరుపై ఆధారపడే పార్టీలకు ఓట్లు

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి







- ప్రజల ఓటింగ్‌లో కనిపిస్తున్న సరికొత్త పరిణితి
- పార్టీలు దీన్ని గుర్తిస్తున్నాయా?
- గుర్తించిన పార్టీలకే భవితవ్యం

**హైదరాబాద్, నేటిధాత్రి:**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 90కి పైగా మున్సిపాలిటీల్లో ఘనవిజయం సా ధించినట్టు గణాంకాలను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. అందులో ఎటువంటి సందేహం లేదు కానీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించినప్పుడు ఇది నిజమైన గెలుపా లేక పైకి కనిపి స్తున్న వాపా? అన్న ప్రశ్న ఉ దయించక మానదు. రాష్ట్రంలోని 123 (116+7) పట్టణ స్థానిక సంస్థలకు చెందిన 3వేల వార్డుల్లో కాంగ్రెస్ గెలుచుకున్నవి 1537. అంటే యాభై శాతం కంటే కొద్దిగా ఎక్కువ. కానీ కైవసం చేసుకున్న మున్సిపాలిటీల సంఖ్య 90 దాటుతోంది. అంటే ఇవన్నీకాంగ్రెస్ వాస్తవ బలాన్ని సూచించవనేది సుస్పష్టం. మొత్తం కాంగ్రెస్ ఆధీనంలోని మున్సిపాలిటీలను పరిశీలిస్తే రేవంత్ పాలనకు ప్రజలు ఆమోదం తెలిపారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం కావడం సహజం. ఎందుకంటే గత మున్సిపల్ ఎన్నికల్లో 1181 వార్డుల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ ఈసారి 781కే పరిమితం కావడం కూడా పై అభిప్రాయానికి బలం చేకూర్చే అంశం. నిజంగా బీఆర్ఎస్ కుప్పకూలిపోయిందా, కాంగ్రెస్ ఎవరూ ఓడించని స్థాయిలో బలపడిందా? అన్న అంశాలను పరిశీలించాలి. వీటిని పరిశీలించే ముందు 30-40 మున్సిపాలిటీల్లో ఏ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించలేదన్న సత్యాన్ని గుర్తిస్తే, గెలిచిన పార్టీది నిజమైన బలమా లేక ఓడిన పార్టీది వాస్తవ ఓటమా అన్నది స్పష్టమవుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 40.1% ఓట్లు సాధించిన కాంగ్రెస్ ఈ మున్సిపల్ ఎన్నికల్లో 39.4% ఓట్లు సాధించిందంటే స్వల్పంగా ఓట్ల శా తం తగ్గిందని తెలుస్తుంది. అదేవిధంగా ఇవే ఎన్నికల్లో బీఆర్ఎస్ కేవలం 16.7% ఓట్లు సాధించగా మున్సిపల్ ఎన్నికల్లో 28.76%కు ఓటింగ్‌శాతం పెరిగింది. చూడటానికి కొంత విచిత్రంగా వుండవచ్చు కానీ, ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో 73% పోలింగ్ నమోదైంది. ఇది ఇటీవలి పంచాయతీ ఎన్నికల్లో జరిగిన 84% పోలింగ్ కంటే తక్కువ, గత లోక్‌సభ ఎన్నికల పోలింగ్ 66% కంటే ఎక్కువ! దీన్ని బట్టి చూస్తే ఓటర్ల మనోగతం స్థానిక, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మారుతోంది. అంటే స్థానిక ఎన్నికల్లో స్థానిక సమస్యలకు, అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ సమస్యలకు, లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ సమస్యలకు ప్రాధాన్యతనిచ్చే పరిణితిని ఈ తరం ఓటర్లు ప్రదర్శిస్తున్నారనుకోవాలి. మరో కీలక అంశమేమంటే ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో 171 మందిఇండిపెండెంట్లు గెలవడం! అంటే ఇక్కడ పార్టీకంటే పనిచేసే నాయకుడి సామర్థ్యం కూడా కీలకపాత్ర పోషిస్తుందనేది సుస్పష్టమవుతోంది. ఇక హైదరాబాద్ వంటి నగరాలో ఓటింగ్ 50శాతం కంటే తక్కువ వుంటుండగా గ్రామీణ ప్రాంతాల్లో 80-90శాతం వరకు నమోదవుతోంది. తక్కువ ఓటుశాతం నమోదవడం పట్టణప్రాంత ఓటర్లలో నెలకొన్న బద్ధకం లేదా నిర్లిప్తత కారణం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో డబ్బులు, మద్యం పంపిణీ స్థానిక నేతలకు అంతా తెలిసి వుండటం వంటి కారణాలను చెప్పవచ్చు. కాంగ్రెస్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 39.4% ఓట్లు సంపాదించగా బీఆర్ఎస్ ఓట్లశాతం 37.3%. అంటే రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా దాదాపు రెండు శాతం మా త్రమే. అదే మున్సిపల్ ఎన్నికల్లో 39.8% ఓట్లు సాధిస్తే బీఆర్ఎస్‌కు 28.7% ఓట్లు పడ్డాయి. ఇక్కడ దాదాపు 11% ఓట్ల తేడా కనిపిస్తోంది. అదే గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40.1% ఓట్లు వస్తే బీఆర్ఎస్‌కు కేవలం 16.7% మాత్రమే వచ్చాయి. అంటే 2024 ఎన్నిక కు ఇప్పటికి పోలీస్తే బీఆర్ఎస్ 12% ఓట్లను పెంచుకోగలిగింది. ఈ విశ్లేషణను పరిశీలిస్తే బీఆర్ఎస్ ఓటమి శాశ్వతం కాదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పుంజుకునే అవకాశాలు మెండుగా వున్నాయన్నది స్పష్టమవుతుంది.

ఇక మున్సిపల్ ఎన్నికల విషయానికి వస్తే 2020లో 100కు పైగా మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఇప్పుడు కేవలం 13కే పరిమితమైంది. అదే కాంగ్రెస్ స్కోరు 90 దాటింది. గత రెండు మూడు దశాబ్దాల క్రితం నాటితో పోలిస్తే ఓటర్లలో పరిణితి స్థాయి గణనీయంగా పెరి గిందనేది పోలింగ్ విశ్లేషణలను పరిశీలిస్తే తెలుస్తుంది. అంటే గుడ్డిగా ఒక పార్టీకి విధేయులుగా మెలిగే అలవాటు నుంచి ఓటర్లు క్రమంగా దూరమవుతున్నారు. ఈ మున్సిపల్ ఓట్లలో కాంగ్రెస్ కు 39.8% ఓట్లు, బీఆర్ఎస్‌కు 28.7% ఓట్లు రాగా బీజేపీకి 15.7% ఓట్లు రావడాన్ని గమని స్తే, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ఇప్పటికీ స్థానిక సమస్యల పరిష్కారం విషయంలో ప్రజలు విశ్వసి స్తున్నారన్నది అర్థమవుతుంది. ఇక బీజేపీని ఇంకా జాతీయస్థాయి పార్టీగా, స్థానిక సమస్యలు దానికి పెద్దగా పట్టవన్న ఉద్దేశంతో ఓటర్లు వున్నారనుకోవాల్సి వస్తుంది. అంటే ఒక్కసారైనా బీజేపీ రాష్ట్ర అధికార పగ్గాలను చేపడితే ఓటర్లలో దానిపట్ల వున్న అభిప్రాయంలో తప్పనిసరిగా మార్పు వచ్చితీరుతుంది. మరో గుర్తించాల్సిన విషయమేంటంటే 2014-2018 మధ్యకాలంలో రాష్ట్రంలోతెలంగాణ ఉద్యమ ప్రభావం బలంగా కొనసాగింది. దాదాపు పద్నాలుగేళ్లపాటు కేసీఆర్ నాయకత్వంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమం రేకెత్తించిన తెలంగాణ సెంటిమెంట్ ప్రభావం అప్పటి వరకు బాగానే వుంది. కానీ తర్వాతి కాలంలో సెంటిమెంట్ స్థానాన్ని "పనితీరు ఆధారంగా" ఓటువేసే ప్రవృత్తి పెరిగింది. అంటే అధికారంలో వున్నప్పుడు బీఆర్ఎస్ ఏమీ చేయలేదని కాదు. దేశంలోనే మొట్టమొదటిసారి రైతుబంధు ప్రవేశపెట్టిన ఘనత ఆ పార్టీదే. అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ కాలంలోనే పూర్తిచేసిన అద్భుత సామర్థ్యం కూడా కేసీఆర్ నాయకత్వానిదే. మిషన్ భగీరథ కేసీఆర్ చేపట్టిన పథకాల్లో కలికితురాయి వంటిదనే చెప్పాలి. ఇదే సమయంలో తెలంగాణ సాధకుడిగా తనకిక తిరుగులేదని భావించడం, అధికారానికి ఢోకా వుండబోదన్న ధీ మాకు వెళ్లడం కేసీర్ చేసిన పెద్దతప్పు. ఫామ్ హౌజ్ పాలన, మంత్రులకు కూడా అపాయింట్ మెంట్ దొరకని దుస్థితి ఆయన రాచరిక పాలనకు చిహ్నంగా మారి, మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి ఆకాశాన్నంటి, బీఆర్ఎస్‌ను పాతాళానికి తొక్కేశాయి. ఎదిగిన కొద్దీ ఒదగని మనస్తత్వం ఆయనతో పాటు కేసీఆర్‌ను నమ్ముకున్న పార్టీని దెబ్బతీశాయి. ఇక్కడ దెబ్బతీశాయనేదానికంటే, ప్రజలు ఒక్కసారి తమ శక్తి ఏమిటో ఆయనకు రుచి చూపించారనుకోవాలి.

విచారించాల్సిన విషయమేంటంటే ఇప్పుడు రేవంత్ కూడా సరిగ్గా ఇదే మాదిరి వ్యవహారశైలిని ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త పథకాల మాదిరిగానే తిట్ల పురాణాన్ని కూడా ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కగా, దీన్ని పరాకాష్టకు తీసుకెళ్లిన ఘనత రేవంత్‌కే చెందుతుంది. కేసీఆర్ తప్పిదాలు, బీఆర్ఎస్‌లోని అవినీతిని వ్యతిరేకిస్తూ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పజెబితే ఇ ప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేబాటలో పయనిస్తోంది. కాంగ్రెస్ శైలి కప్పలతక్కెడ రాజకీయాలు లేకపోయినప్పటికీ, పార్టీలో పైకి వినిపించని అసమ్మతి రాగాలు, రేవంత్ ఛరిష్మా హెా రులో ఎవరికీ వినిపించడంలేదు. ప్రస్తుతానికి కాంగ్రెస్‌లో తన స్థాయి ఛరిష్మా గల నాయకుడు మరొకరు లేకపోవడం రేవంత్‌కు కలిసొచ్చిన అంశం. అధిష్టానానికీ ఆయన తప్ప మరో దిక్కులేదు. ఇన్ని సానుకూలతల మధ్య కేసీఆర్ తిట్లపురాణాన్ని రేవంత్ మరోస్థాయికి తీసుకెళ్లినా ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కట్టారు. ఇదే ట్రెండ్ కొనసాగితే ఎంత గట్టిగా తిడితే అన్ని ఓట్లు రాలతాయన్న తప్పుడు అభిప్రాయం ఏర్పడే ప్రమాదముంది. నిజామాబాద్ లో ధర్మపురి అరవింద్ కూడా తిట్ల పురాణంలో దిట్టగా పేరుపడ్డారు. అంటే తెలంగాణ రాజకీయాలు...సైద్ధాంతిక విభేదాలు, ఉద్యమ రాజకీయాల స్థాయిని దాటి తిట్ల స్థాయికి చేరుకున్నాయి. ఇదెంతకాలం కొనసాగుతుందో తెలియదు. ఇక కాంగ్రెస్‌లో మిగిలిన నాయకుల్లో కూడా రేవంత్ లేకపోతే పార్టీ మనుగడ వుండదన్న అభిప్రాయం ఏర్పడిందో ఏమో కానీ,మంత్రులంతా రేవంత్ భజన చేయడంలో పోటీపడు తున్నారు. ఇది తెలుగుదేశం, బీఆర్ఎస్, డీఎంకే, అన్నాడీఎం కే వంటి ప్రాంతీయ పార్టీల్లో కనిపిస్తుంది. దేశంలో అన్ని రాష్ట్రాల్లో వరుసగా దెబ్బతింటూ, పైకి లేవలేని స్థితిలో వున్న కాంగ్రెస్, తెలంగాణలో జవజీవాలు కల్పించిన రేవంత్‌ను వదులుకోలేని పరిస్థితి ఏర్పడింది. సరిగ్గా ఇదే పరిస్థితి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ది. కమ్యూనిస్టు నాయకత్వం ఆయనకు తలగ్గాల్సిదే తప్ప ఆయన మాత్రం 'తగ్గేదే లేదు' అంటు న్నారు. దీంతో పోలిట్ బ్యూరో తన ప్రాభవాన్ని కోల్పోయింది. తర్వాతి కాలంలో రాహుల్ తన వ్యవహారశైలి మార్చుకోకపో వడం, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ యధాప్రకారం ఓటమి చవిచూ డటం జరిగితే, రేవంత్ కూడా పినరయి విజయన్ పంథాల్లో వెళ్లకూడదనేం లేదు. కాంగ్రెస్‌లో అధిష్టానాన్ని ధిక్కరించినవారు శంకరగిరి మాన్యాలు పట్టిపోవడమే మనకు ఇప్పటివరకు తెలుసు. ఇప్పుడు రేవంత్ అధిష్టానానికి అదే రుచిచూపిస్తే? అప్పుడు ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయన్న సామెత నిజమైందనుకొని మౌనంగా ఎవరి పనిలో వారు నిమగ్నం కావడం తప్ప చేసేదేమీ వుండదు.


"నేటిధాత్రి" 21వ వసంతపు తోరణం
చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"
పత్రికా ప్రయాణం సాగిస్తూ "21 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
8520007444
21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం
మీ
కట్టా రాఘవేందర్ రావ్
9908658888, 8297779999



# నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక

21st ANNIVERSARY 2004-2025



ఆదివారం 22-02-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 21 సంచిక : 279 రూ॥ 6.00




# అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి

## డీసీసీ అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు

–డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

- కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి
- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి

వికారాబాద్, నేటిధాత్రి:

భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు



# పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

- పాతవస్తువులు ఇస్తే నిత్యావసర వస్తువులు ఇస్తున్నాం
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా బాధ్యతే
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో చెత్త ఏరివేత చేపట్టాం
- వినుకొండ సభలో సీఎం చంద్రబాబు వెల్లడి

12 లో

పల్నాడు, నేటిధాత్రి:

గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి

# ఎమ్మెల్యే జివి ఆసక్తిక వ్యాఖ్యల

- 50కోట్లు అనడానికి బదులు 50వేల కోట్లు అంటూ వ్యాఖ్య
- సరిదిద్ది నవ్వుకున్న చంద్రబాబు

పల్నాడు, నేటిధాత్రి:

వినుకొండలో సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రసంగిస్తూ.. వినుకొండలో పార్కు, స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం కోసం రూ.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని అన్నారు. అది విన్న సీఎం చంద్రబాబు నవ్వులు చిందించారు. అనంతరం ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను సరిదిద్దుకొని రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు. ఈ వ్యాఖ్యలతో అక్కడున్న టిడిపి వారు కూడా నవ్వులు చిందించారు.



# ప్రధాని నివాసం కోసం మురికివాడల ఖాళీ

- ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు
- దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు జారీ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో



# ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

- అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్
- కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని

12 లో



# ప్రధాని మోదీ రాజీపడ్డారు

- 18 రోజు వేచి ఉంటే ఏకపక్ష ఒప్పందం
- ట్రేడ్ డీల్ ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

అమెరికా విధించిన సుంకాలను సుప్రీంకోర్టు రద్దు

12 లో

# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం



- దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, నేటిధాత్రి:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరగబోతుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన అగ్రి షో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అమెరికా తో చేసుకున్న ఒప్పందం వల్ల ఆ దేశంలో పండిన సోయా, మక్కలు , పత్తి లాంటివి ఎలాంటి టాక్స్ లేకుండా ఇండియాకు దిగుమతి అవుతాయని వెల్లడించారు. రూ. 45 లక్షల కోట్ల విలువైన మక్కజొన్న, పత్తి, సోయా అమెరికా మనకు పంపిస్తే మన దేశ రైతులు ఏం కావాలని ప్రశ్నించారు. సోయా పంటను ఎక్కువగా పండించే ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ రైతుల పరిస్థితి ఏం కావాలని అన్నారు. ఈసారి మన ప్రాంతాల్లో మక్కలు ఎక్కువ పండిస్తున్నారు. ఆ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారే ప్రమాదముందని వెల్లడించారు. విదేశాల నుండి వచ్చే పామ్ క్రూడ్ ఆయిల్ పైన 25 శాతం టాక్స్ ఉండేదని. నేడు 16 శాతానికి తగ్గించడం వల్ల ఇక్కడ రూ. 25వేలు ఉన్న పామ్ ఆయిల్ టన్ను రేట్ రూ. 21వేలకు పడిపోయిందని పేర్కొన్నారు. సుంకాలు తగ్గించడం వల్ల భారత రైతులకు ఏం లాభం జరుగుతుందో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా



- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక

కామారెడ్డి, నేటిధాత్రి:

కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశా రు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముం దుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చే వాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు.



# అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు

- సుంకాలు వెంటనే అమల్లోకి..
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- సుప్రీం తీర్పుపై ట్రంప్ తీవ్ర నిరాశ
- వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక

12 లో

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన



# ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

- ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్
- నిఘా వర్గాల హెచ్చరికలు జారీ
- ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

దేశ రాజధాని ఢిల్లీలో

12 లో



# నెలఖరు వరకు తెలంగాణలో పత్తి కొనుగోళ్లు

## ప్రభుత్వం విజ్ఞప్తితో సిసిఐ నిర్ణయం

హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణలో ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు చేయనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తితో సీసీఐ నిర్ణయం తీసుకుంది. జాయింట్ సెక్రెటరీ, కేంద్ర జౌళిశాఖకి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి లేఖ రాశారు. పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మంత్రి తుమ్మల కోరారు. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ నిర్ణయంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అయితే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో కూడా పత్తి రైతులకు ఊరట లభించింది. సీసీఐ సంస్థ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో సమస్యను ఎంపీ వంశీ దృష్టికి తీసుకెళ్లారు రైతులు. వెంటనే స్పందించిన ఎంపీ వంశీ.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా( సీసీఐ)తో మాట్లాడి ప్రొక్యూర్మెంట్ గడువును పొడిగించాలని కోరారు. రైతులకు సంబంధించిన పత్తి పంట ఇంకా పూర్తి దశలోకి చేరుకోలేదని.. ఇంకా పత్తి తీసే దశ ఉందని సీసీఐ దృష్టికి తీసుకెళ్లారు. పత్తి కొనుగోళ్ల పక్రియను మరికొన్ని రోజులు కొనసాగించాలని ఆయన కోరారు. ఎంపీ వంశీ లేఖకు స్పందించిన సీసీఐ సంస్థ మరో 7 రోజులు పత్తి కొనుగోళ్లు చేసుకోడానికి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని నియోజకవర్గ రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ ఎంపీ వంశీ కోరారు. ఎంపీ వంశీ కృష్ణ చేసిన కృషికి హర్షం వ్యక్తం చేశారు స్థానిక రైతులు.

# 1,100 ఫైల్స్ దగ్ధం ..




- డేటా రికవరీ చేయడం కష్టం
- కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ఎంతో ముఖ్యం
- నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై ప్రత్యేక బృందం

ములుగు, నేటిధాత్రి:

నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్ లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి



- కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత
- పరస్పరం దాడి చేసుకున్న బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు
- పోలీసులు రంగోలకి దిగడంతో అదుపులోకి పరిస్థితి

కామారెడ్డి, నేటిధాత్రి:

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గిరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే

ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# గెలిచిన కౌన్సిలర్ కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

▸▸కాంగ్రెస్ పార్టీ పరిపాలన ఇందిరమ్మ రోజులను తలపిస్తుంది.... ▸▸సింగరేణి, పోలీస్ అధికారులు తస్మాత్ జాగ్రత్త....
▸▸సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్... ▸▸బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్.... ▸▸బిఆర్ఎస్ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్.... ▸▸బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు.... ▸▸సిపిఐ పార్టీ ప్రలోభాలకు లొంగదు...



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతన్ పల్లి మున్సిపాలిటీకి 22 వార్డులు ఉండగా ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సిపిఐ పార్టీతో కలిసి అన్ని వార్డుల్లో పోటీ చేసి 14 సీట్లు కైవసం చేసుకున్నా సరే చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాన్ని దక్కకుండా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, స్థానిక మంత్రి వివేక్ వెంకటస్వామి కుట్రలను ప్రజలంతా గమనిస్తున్నారని, గెలిచిన కౌన్సిలర్లను వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కౌన్సిలర్ల కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. 11వ వార్డు లో గెలిచిన కౌన్సిలర్ బొమ్మ భూమయ్య గౌడ్ ఇంటి సమీపంలోకి సింగరేణి అధికారులు వచ్చి అట్టి భూమి సింగరేణికి సంబంధించిందని, సూచిక బోర్డులు పాతి భూమయ్య గౌడ్ భార్యను ఇబ్బందులకు గురిచేసిన నేపథ్యంలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు, సిపిఐ కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ లతో కలిసి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రామకృష్ణాపూర్ లోని కౌన్సిలర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కౌన్సిలర్ భార్యకు మనోధైర్యాన్ని అందించారు. అనంతరం స్థానిక మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన ఇందిరమ్మ రోజులను తలపిస్తోందని దుయ్యబట్టారు. సిపిఐ పార్టీ కౌన్సిలర్లను బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేస్తూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న సరే ఎక్కడ కూడా కౌన్సిలర్లు కానీ కుటుంబ సభ్యులు కానీ బెదరకుండా ముందడుగు వేస్తున్నారని అభినందించారు. క్యాతన్ పల్లి మునిసిపాలిటీ చైర్మన్ పీఠంపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడులు చేసి అక్రమంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై కేసులు పెట్టి జైలుకు పంపించారని, అక్కడే కాంగ్రెస్ పార్టీ పతనం మొదలయ్యిందని అన్నారు. బిఆర్ఎస్, సీపీఐ నాయకులపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తేయాలని డిమాండ్ చేశారు. దాడులకు దిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల పై కేసులు ఎందుకు పెట్టలేదో పోలీసులు తెలిపాలని అన్నారు. పోలీస్ శాఖ పూర్తిగా విఫలమయిందని, అధికార కాంగ్రెస్ పార్టీకి తొత్తుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడి లకు తలొగ్గి కౌన్సిలర్ల కుటుంబాలపై ఒత్తిడి తీసుకొస్తే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి, స్థానిక మంత్రికి ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సిపిఐ పార్టీ ఎలాంటి ప్రలోభాలకు లొంగదని , పొత్తు ధర్మాన్ని విస్మరించే ప్రసక్తే లేదని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, సిపిఐ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో యువజన సంఘాల సమావేశం...



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో యువజన సంఘాల సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా మండపల్లి గ్రామంలో స్థానిక సర్పంచి గాధగోని సాగర్ ఆధ్వర్యంలో యువజన సంఘాల సమావేశం నిర్వహిస్తూ. ప్రతి గ్రామంలో గ్రామాలు అభివృద్ధి జరగాలంటే గ్రామ యువత సహకరించాలని యువత చదువుతోపాటు గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రతి గ్రామంలో గ్రామ అభివృద్ధి జరగాలంటే యువజన సంఘాల పాత్ర కీలకమని. ప్రతి గ్రామంలో అభివృద్ధి . యువజన పథంగా. యువజన సంఘాలు ఏర్పరచుకొని అందులో యువత పాలుపంచుకుంటూ చదువుతోపాటు గ్రామాన్ని అభివృద్ధితో పాటు అన్ని విషయాలు ప్రజలకు సంబంధించి కార్యక్రమాలు చేపడుతూ. అభివృద్ధి పథంలో ముందు ఉంచే బాధ్యత యువజన సంఘాలపై ఎక్కువగా ఉంటుందని. దీనిపై ప్రతి గ్రామంలో యువత యువకులు గ్రామ ప్రజలు అందరూ సహకరించి అభివృద్ధి పథంలో ముందు ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# వివాహం జరుగుతున్న కుటుంబానికి 50 కేజీల బియ్యంఅందజేత....

**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:**



తంగళ్ళపల్లిమండలం ఇందిరమ్మ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని కెసిఆర్ కాలనీలో. జరుగుతున్న పెండ్లికి బియ్యం అందజేసిన సర్పంచ్. తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని కేసీఆర్ నగర్ ఐదవ వార్డులో జరుగుతున్న పెళ్లికి. మెరుగు వెంకటేశం కూతురు వివాహం జరుగుతుండగా గ్రామ సర్పంచ్ గడ్డం రచన మధుకర్. తమ వంతు గా. అమ్మాయి పెళ్లికి గాను 50 కేజీల బియ్యం అందజేసిన సర్పంచ్ గడ్డం రచన మధుకర్. ఈ సందర్భంగా అమ్మాయి పెళ్లి జరుగుతున్న సందర్భంగా వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసి వారు జీవితంలో సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించి మా వంతు సహాయంగా బియ్యం అందజేయడం జరిగిందని. ఆ దేవుడు దయవల్ల అందరూ సుఖసంతోషాలతో బాగుండాలని కోరుకుంటున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో. ఉప సర్పంచ్ కొండ శ్రీకాంత్. వార్డు సభ్యులు భరత్. ఖాజా. శ్యామల. లాస్య. కాంగ్రెస్ పార్టీ నాయకులు. కుసుమ హేమంత్. బైరిరమేష్. సుంకరి శ్రీనివాస్. బుర్లసాయి కృష్ణ. కాజా. మల్లికార్జున. సిద్ధి రాములు. రవి. కృష్ణ. ప్రసాద్. కవిత. లక్ష్మి. తదితరులు పాల్గొన్నారు

# భేషజాలం లేకుండా పట్టణ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తా

▸▸బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్,వైస్ చైర్మన్ గంధం నరేందర్
▸▸మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్..



**నర్సంపేట, నేటిధాత్రి:** పార్టీలకతీతంగా ఎలాంటి భేషజాలం లేకుండా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పట్టణ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపాలిటీ కౌన్సిలర్ల ఎన్నికల్లో 30 స్థానాలకు గాను 21 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా విజయఢంకం మోగించి మున్సిపాలిటీ పీఠం కైవసం చేసుకున్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ,వైస్ చైర్మన్ గా గంధం నరేందర్ ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్,వైస్ చైర్మన్ గంధం నరేందర్ మున్సిపాలిటీటీ కార్యాలయంలో హట్టహాసంగా పదవిబాధ్యులు చేపట్టారు. ముందుగా నూతన బాధ్యతలు చేపట్టేందుకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్,వైస్ చైర్మన్ గంధం నరేందర్ తో పాటు కౌన్సిలర్లకు కమిషనర్ కాటా భాస్కర్ సిబ్బందితో కలిసి స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్మన్ లు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి బోకెలతో సత్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. వార్డుల అభివృద్ధి కోసం కౌన్సిలర్లు,అధికారుల సహకారంతో పార్టీలకతీతంగా పట్టణ ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేరుస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ గంధం నరేందర్ మాట్లాడుతూ తన వార్డుతో పాటు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తునని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ బత్తిని రాజేందర్,మాదాసి రవి,వేముల సంధ్య సాంబయ్య గౌడ్,ఎలకంటి విజయ్ కుమార్,కొత్తకొండ మేఘున,కొంపల్లి వీణ,ముత్తినేని వెంకన్న,పొన్నాల మనిషా, చీకటి స్వరూప,ఇస్లావత్ రామ గోపి,భూక్య మత్రు రాథోడ్,ఏపూరి శ్రీనివాస్ రెడ్డి,అయూబ్ ఖాన్,శ్రీ రామోజీ రోజారాణి,బాణాల ప్రసన్న,వేల్పుల శ్రీలత,ములకల వినోద,పున్నం నరసింహారెడ్డి బీరం భరత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# వర్తక సంఘము భవనంలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న రామకృష్ణ సుమన్

**వాసవి క్లబ్ అద్యరములో**



**వనపర్తి, నేటిధాత్రి:** వనపర్తి జిల్లా కేంద్రంలో వర్తక సంఘం భవనం ములో డాక్టర్ మనోహర్ లోయ రాజస్థాన్ డాక్టర్లచే మోకాళ్ల నొప్పులకు కీళ్ల నొప్పులకు నడుము నొప్పులకు తుంటినొప్పులకు గ్యాస్ట్రో బిపి షుగర్ పక్షవాతం ఇంకా 100కు పైగా వ్యాధులకు 5 రోజులపాటు వైద్యం అందిస్తున్నామని వాసవి క్లబ్ అధ్యక్షులు ఆకుతోట రాఘవేందర్ తెలిపారు వాసవి క్లబ్ జిల్లా ఇంచార్జీ కొట్ర రామకృష్ణ మాట్లాడ తూ పాలమూరు రాయచూరులో అక్కడ ఆర్యవైశ్య లు ఈ మెడికల్ ఏర్పాటు క్యాంపు ఏర్పాటు చేశారని పరీక్షలు చేసుకొని డాక్టర్ల సూచనలు పాటించా రని చెప్పారు మనము ఆరోగ్య ము మన తోనే ఉంటుందని యోగ ధ్యానము వాకింగ్ చేయాలని సూచించారు వర్తక సంఘం అధ్యక్షులు పాలా ది సుమన్ మాట్లాడుతూ వనపర్తి లో వర్తక సంగం భవనంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించినందుకు ఆకుతోట రాఘవేందర్ క్లబ్ నిర్వాహకులను అభినందించా రు వర్తక సంఘము భవనంలో నిర్వహించే మెడికల్ క్యాంపుకు కిరాణా వ్యాపారులు పాల్గొని తమ ఆరోగ్యాన్ని పరీక్షలు చేయించుకోవాలని అదేవిధంగా డాక్టర్లచే సూచనలు సలహాలు పాటించాలని ఆయన కోరారు ఎలాంటి మందులు మెడిసిన్ లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన అన్నారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వాసవి క్లబ్ నేతలు దాచ హరీష్ చిగుళ్ల పల్లి కార్తిక్ గోల్డ్ క్లబ్ అధ్యక్షురాలు కొంపల రజిత ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి రాధిక కోశాధికారి ప్రశాంతి లక్ష్మి వర్తక సంఘం నేతలు కొండ కిషోర్ వై వెంకటేష్ దోమశివ వర్తక సంఘము సీనియర్ నేత ఆర్ టి కొండ బాలకృష్ణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు

# దళితవార్డులను మోడల్ వార్డు లుగా తీర్చిదిద్దుతాం

▸▸చైర్మన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్,30వ వార్డు కౌన్సిలర్ మాదాసి రవి లకు ఘన సన్మానం
▸▸మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మున్సిపల్ పరిధిలోని దళితవార్డులను మోడల్ వార్డు లుగా తీర్చిదిద్దుతామని చైర్మన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ హామీ ఇచ్చారు. పట్టణంలోని 30 వార్డులో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు అధ్యక్షతన నూతనంగా చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన పెండెం లక్ష్మీ రామానంద్,అదే వార్డు కౌన్సిలర్ మాదాసి రవి, మహిళా కౌన్సిలర్లు వేల్పుల శ్రీలత బాణాల ప్రసన్న కుమారి లను వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీలక్ష్మి రామానంద్ మాట్లాడుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ పరిధిలోని దళిత వార్డులను మోడల్ వార్డులుగా తీర్చిదిద్దుతానని , వేసవి కాలంలో త్రాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. వార్డులలో డ్రైనేజీలు సిసి రోడ్లు విద్యుత్తు సరఫరా నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాటు చేస్తానని , అర్హులైన వారికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ మాట్లాడుతూ మా తాత పెండెం కట్టయ్య కాలము నుండి నేటి వరకు 30 వ వార్డుతో విడదీయరాని సంబంధం ఉందని అన్నారు. వార్డు ప్రజల అవసరాలు మరియు వార్డు సమస్యలను పరిష్కరించడానికి అందుబాటులో ఉంటానని అన్నారు. నర్సంపేట పట్టణ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. 30 వ వార్డు కౌన్సిలర్ మాదాసి రవి మాట్లాడుతూ వార్డు ప్రజలమంతా ఒక కుటుంబం అని కుటుంబంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని అన్నారు. వార్డులో నీటి సమస్య పట్ల బోర్లు ఏర్పాటు చేయాలని, డ్రైనేజ్ కాలువలు సిసి రోడ్ల నిర్మాణం వంటి పనులు ఉన్నాయని అవి త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు నాగేల్లి సారంగం ,మాజీ వార్డ్ మెంబర్ కొయ్యడి సంపత్ సీనియర్ నాయకులు దూడల సాంబయ్య,గద్ద సంజీవ, గద్ద శ్రీనివాస్ గద్ద జ్యోతి, నూనె పద్మ, కోమటి సరోజన, జానకమ్మ, గద్ద అఖిల్, నూనె బన్ను, గద్ద నీ ఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఆంజనేయులు



**శేరిలింగంపల్లి, నేటిధాత్రి:**
అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్మిస్తున్న మల్లన్న గుడి నిర్మాణ పనులను స్థానిక నాయకులు ఆంజనేయులు సాగర్ శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, ఆలయ ప్రాశస్త్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు సాగర్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక విలువల కేంద్రాలని పేర్కొన్నారు. మన డివిజన్‌లో ఇంతటి గొప్ప ఆలయాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అని, ఆలయ నిర్మాణానికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లన్న గుడి కమిటీ అధ్యక్షులు బసవరాజు, సిద్దిక్ నగర్ కాలనీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, నాయకులు యాదయ్య గౌడ్, గోపాల్ గౌడ్, సంతోష్, రాము యాదవ్, రాము, సాగర్, ఆనంద్ మరియు కమిటీ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధ్వర్యంలో 172వ వారం అన్నదానం 3100 మందికి అన్నప్రసాదం

▸▸ఆకలి తీర్చడమే పరమావధి.. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 172వ వారం అన్నదానం సుమారు 3100 మంది పేదలకు అన్నప్రసాద వితరణ
▸▸సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న చైర్మన్ కొండ విజయ్ కుమార్



**శేరిలింగంపల్లి, నేటిధాత్రి:** పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా హోప్ ఫౌండేషన్ సాగిస్తున్న సేవా యజ్ఞం మరో మైలురాయిని అధిగమించింది. ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో హుడా కాలనీలోని కార్యాలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఈ శనివారంతో విజయవంతంగా 172వ



చేరుకుంది. నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 3100 మంది పేద ప్రజలు, కూలీలు మరియు బాటసారులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గత మూడు సంవత్సరాలకు పైగా ఒక్క వారం కూడా విరామం లేకుండా నిరంతరాయంగా ఈ కార్యక్రమం కొనసాగడం ఈ సందర్భంగా చైర్మన్ కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. "ప్రతి శనివారం పేద ప్రజల ఆకలి తీర్చడంలో లభించే తృప్తి మరెక్కడా దొరకదు. హోప్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడమే మా సంకల్పం. 172 వారాలుగా ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగడానికి సహకరిస్తున్న సభ్యులకు, వాలంటీర్లకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. లబ్ధిదారుల హర్షం: "రోజంతా కష్టపడితే గానీ పూట గడవని మాకు, ప్రతి శనివారం ఇక్కడ కడుపునిండా నాణ్యమైన భోజనం లభించడం గొప్ప వరం'' అని అన్నప్రసాదం స్వీకరించిన పలువురు పేదలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చాలి



▸▸ఇచ్చిన మాటని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి....
▸▸హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పోడిశెట్టి గణేష్

**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సకాలంలో ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి హామీలు 250 గజాలు ఇంటి స్థలం గౌరవ పెన్షన్ ఇతర హామీలను నెరవేర్చే దిశగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ కృషి చేస్తున్నారని వారికి తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షులు పొడిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో సమా వేశం ఏర్పాటు చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపా ధ్యక్షులు గిద్దమారి సురేష్ పల్లె బోయిన సారయ్య బాసాని విద్యాసాగర్ గిద్ద మరి రామన్న యూత్ జిల్లా అధ్యక్షులు కొమ్ముల శివ మండల యూత్ అధ్యక్షులు ముంజల నాగరాజు మండల ఉపాధ్యక్షులు ఎండి రఫీ కోశాధికారి కానుగుల నాగరాజు టౌన్ ప్రెసిడెంట్ రంగు మహేందర్ నమిత భాజ్ అశోక్ రాజ్ మహమ్మద్ తుమ్మ ప్రభాకర్ అరికెళ్ల వీరయ్య మైలారం గ్రామ ఉద్యమకారుల అధ్యక్షుడు దూదిపాల జోగి రెడ్డి జూపాక సారయ్య పాల్గొన్నారు.

# జడ్పీటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో అయిన 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించండి.



**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా ( జహీరాబాద్ నియోజకవర్గ ము) బీసీ జేఏసీ ఆధ్వర్యంలో త్వరలో జరుగబోయే స్థానిక సంస్థ ల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు పక్క అమలు పర్చలని బీసీ జేఏసీ డిమాండ్ చేసింది. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చింది గుర్తుంచికొని ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రభుత్వము బీసీలకు మాట తపిందిఅని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు పర్చలని చూచించారు. ఇది వరకే మున్సిపల్ ఎన్నికల్లో బీసీ లకు మోసం జరిగింది. కాబట్టి ఇప్పుడు త్వరలో జరుగబోయే స్థానిక ఎలక్షన్లులో అమలు పర్చలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు కొండాపురం నర్సింలు. బీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్. పెద్దగొల్ల .నారాయణ, కార్యదర్శి శంకర్ సాగర్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఇమ్రాన్, నాయకులు మోహన్, గోపాల్, నాయకుని శ్రీకాంత్ బాలకృష్ణ, శివ మాదినం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కోసం పని చేయాలి మాజీ మంత్రి

▸▸మాజీ మంత్రిని కలిసిన అలియాబాద్, ఎల్లంపేట్ మునిసిపల్ బిఆర్ఎస్ కౌన్సిలరు.. ▸▸మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి



**మేడ్చల్, నేటిధాత్రి:** ప్రజా సంక్షేమం కోసం కలసి కట్టుగా పని చేయాలని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు. ఎల్లంపేట్, అలియాబాద్ మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికయినా మున్సిపల్ ఛైర్పర్సన్, కౌన్సిలర్లు బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వీరందరికి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట్ మునిసిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్ సురేష్, భాస్కర్, కుమార్, నిషితరెడ్డి, అలియాబాద్ తూము యమున శ్యామ్, గుర్క కుమార్ యాదవ్, బి ఆర్ ఎస్ అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చీదు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు బండి రాంరెడ్డి, మన్మధచారి, గౌస్ పాషా, హరిమోహన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, నర్సింహా, కుమార్, నరేష్ గౌడ్, సత్యం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉంటాయి

▸▸అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**భూపాలపల్లి, నేటిధాత్రి:** మంచి చేసే వారికి ఎల్లప్పుడూ భగవంతుని ఆశీస్సులు ఉంటాయ ని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శనివారం కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుహాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 12.15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక శాసనసభ్యులు కోరిన విధంగా అదనపు నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సభాపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఆలయ పునః ప్రతిష్ఠకు సంబంధించిన సంప్రోక్షణ కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు.




పునః ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య యాగశాల కార్యక్రమాలు, కుంభాభిషేకం,
మహా పూర్ణాహుతి వంటి శాస్త్రోక్త క్రతువులు నిర్వహించబడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలేకాక సామాజిక ఐక్యతకు ప్రతీకలని తెలిపారు. కొడవటంచలోని ఈ చారిత్రక దేవాలయం పునఃప్రతిష్ఠ జరగడం శుభసూచకమని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న జీయర్ స్వామి ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాలయ చైర్మన్ సంపత్ రావు, ఈఓ మహేష్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.




# ఈ నెల 23వ తేదీ నుండి ప్రజావాణి కార్యక్రమం యధాతథం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నేటిధాత్రి:** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుండి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని, తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.



# సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు స్ఫూర్తిదాయకం

▸▸పటాన్ చెరు లో ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు.. భారీ ర్యాలీ..
▸▸బిడిఎల్ లో సంత్ సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి 15 లక్షల రూపాయలు సొంత నిధులు..
▸▸తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బిఆర్ఎస్ దే
▸▸ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పాటన్‌చెరు, నేటిధాత్రి:** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గిరిపుత్రులు, గిరిజనుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని.. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం భానూరు పరిధిలోని బిడిఎల్ లో సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం నిర్మాణానికి పదిహేను లక్షల రూపాయల సొంత నిధులు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో శనివారం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలను అధికారికంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం నుండి జిఎంఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జిఎంఆర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.



ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందని అన్నారు. సామాజిక ఆర్థిక రాజకీయ ప్రభుత్వ ఉద్యోగ రంగాల్లో గిరిజనులకు పెద్ద పీట వేయడం జరిగిందని తెలిపారు. గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రత్యేకంగా ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి రంగంలోనూ గిరిజన బిడ్డలు ఉన్నత స్థాయిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం గర్వకారణమని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలోని వెలిమెల, కొల్లూరు, రాళ్లకత్వ, ఐలాపూర్, కొత్తపల్లి తండాల పరిధిలో సొంత నిధులతో శ్రీ భవానీ మాత సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను నిర్మించామని గుర్తు చేశారు. జయంతులు, వర్ధంతుల సమయాల్లోనే మహనీయుల సేవలను గుర్తించుకోవడం కాకుండా.. నిరంతరం వారి నుండి స్ఫూర్తి పొంది ముందుకు కొనసాగాలని సూచించారు. భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం మానవజన్మ అని.. పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆ జన్మకు పరిపూర్ణత లభిస్తుందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ప్రారంభమైందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులను నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఉత్సవ సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ముత్తమ్మ సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, బంజారా సంక్షేమ సంఘం, బంజారా ఉద్యోగ సంఘం ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ఉరి పెట్టుకొని ఆత్మహత్య




**ఇబ్రహీంపట్నం, నేటిధాత్రి:** మండల కేంద్రానికి చెందిన లక్కం రాజశేఖర్ వయస్సు (45) అనునతడు ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున జీవితంపై విరక్తి చెంది గత మూడు రోజుల క్రితం అతని భార్య తన తల్లి గారి ఇంటికి వెళ్లగా నిన్నటి రోజున రాత్రి ఇంట్లో పడుకున్న తర్వాత ఇంట్లో ఎవరు లేని సమయంలో తన ఇంట్లోని ఫ్యాన్ కి లుంగీ సహాయంతో ఊరుపెట్టుకొని మరణించినాడని ఉదయం ఎంతసేపైనా మృతుడు ఇంట్లో నుండి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన మృతుడి అన్న ఆయన లక్కం శ్రీనివాస్ అనునతడు ఇంటికి వెళ్లి చూడగా మరణించి ఉన్నట్లుగా గమనించారు అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది. అని ఎస్ఐ తెలిపారు.

# అంతారం గ్రామ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్




## విద్యా అభివృద్ధిపై సమగ్ర చర్చ

**చేవెళ్ల, నేటిధాత్రి:** చేవెళ్ల మండలం అంతారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు రామారావు అధ్యక్షతన పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, పాఠశాలల అభివృద్ధి, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి, ఉపసర్పంచ్ వెంకటేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జుట్టు రామస్వామి మాట్లాడుతూ..విద్యార్థుల భవిష్యత్తు వారి చదువులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఉపసర్పంచ్ వెంకటేష్ బాబు మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారం అని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం, ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలు, బోధన విధానాలు మరియు పాఠశాలలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేసి, వారి అభిప్రాయాలను స్వీకరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరమైన సదుపాయాల గురించి కూడా చర్చించడం జరిగింది. అదేవిధంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలనలో భాగంగా సర్పంచ్, ఉపసర్పంచ్ విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆహార నాణ్యత, మెనూ అమలు వంటి అంశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదు సమన్వయకర్తగా ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి, నేటిధాత్రి:** జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించింది. రెన్యువల్స్ తో పాటు కొత్త సభ్యత్వం పెంచడంతో పాటు జెన్ జీ తరాన్ని జనసేన పట్ల మొగ్గు చెప్పేలా చర్యలు చేపట్టింది. పార్టీ సభ్యత్వ నమోదు పెంపుకు పార్లమెంట్ నియోజకవర్గం ప్రామాణికంగా తీసుకుని సమన్వయకర్తలను నియమించింది. ఇందులో భాగంగా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్తగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ను పార్టీ అధిష్టానం శనివారం సాయంత్రం ప్రకటించింది. తిరుపతి జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు పెంపుకు పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్ తో పాటు సీనియర్స్ ని, వీర మహిళలని కలుపుకొని కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం గత ఏడాది 16,065 మంది సభ్యత్వంతో మొదటి స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. తిరుపతి తో పాటు పార్లమెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం లోనూ సభ్యత్వం పెంపుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పవన్ కల్యాణ్ అభిమానులు సైతం పార్టీ సభ్యత్వం తీసుకుని జనసేనను బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్ లో తిరుపతి నియోజకవర్గ పార్టీ నాయకులు, వీర మహిళలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు...

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి




**ఇబ్రహీంపట్నం, నేటిధాత్రి:** మండలంలోని ఎర్దండి గ్రామ శివారులోని బాశెట్టి గణేష్ వ్యవసాయ భూమిలో మృతుడు ఎర్రోళ్ల లింబాద్రి వయస్సు (51) మృతుడు మొగలిపేట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు అతనికి తల పగిలి తీవ్ర రక్తస్రావం అయ్యి బోర్లబొక్కలో పడి ఉండి చనిపోయి ఉన్నాడు అని, కొద్ది దూరంలో రోడ్డు ప్రక్కనే అతని బైక్ పడిపోయి ఉన్నదని. అయితే సుమారు 8:30 గంటల సమయంలో మృతుడు లింబాద్రి వారి కుటుంబ కలహాలతో గత కొన్ని సంవత్సరాలుగా ధూరంగా ఉంటున్నాడు మృతుడి భార్య ఆమె తల్లి గారి ఇంట్లో తన పిల్లలతో పాటు జీవిస్తున్న తన బార్య వద్దకి తన బైక్ మీద ఏర్దండి గ్రామానికి వచ్చి వాళ్ళ భార్య ఎర్రోళ్ల లక్ష్మీ మరియు అతని పిల్లలతో తో గొడవ పడినాడు ఇట్టి గొడవ కారణంగా లింబాద్రి నీ అతని భార్య , పిల్లలు చంపి ఉండొచ్చని అనుమానం ఉన్నదని, ఎర్దండి గ్రామపంచాయతీ సెక్రెటరీ పూదరి మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది. ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్ మరియు మెట్పల్లి సిఐ వి అనిల్ కుమార్ గార్లు సంఘటన స్థలాన్ని సందర్శించినారు.

# పనికిరాని పాత వస్తువులను అందించండి...

▸▸ఆర్ సి పురం లో స్వచ్ఛ రథంప్రారంభం...
▸▸నిత్యవసర వస్తువులు పొందండి... ▸▸ఎం తిరుమలరెడ్డి....



**రామచంద్రాపురం, నేటిధాత్రి:** మండలంలోని గ్రామాలల్లో ప్రజలు ప్లాస్టిక్ గాజు, లోహపు, న్యూస్ పేపర్లు వంటి నిరుపయోగమైన వస్తువులను స్వచ్ఛరథానికి ఇస్తే, వాటికి ప్రతిఫలంగా నిత్యావసర సరుకులను ఉచితంగా అందిస్తారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిసరాల శుభ్రతే లక్ష్యంగా ప్రజలు పనికిరాని వ్యర్థాలను సేకరించి స్వచ్ఛ రథానికి అందజేయాలన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలు స్వచ్ఛ రథాని సద్వినియోగం చేసుకొని స్వచ్ఛ ఆంధ్ర. స్వర్ణ గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. మండలంలో అన్ని గ్రామాలలో స్వచ్ఛ రథం తిరుగుతుందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో తేజవతి మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన వ్యర్థాల బరువును లెక్కించి, వాటికి సమానమైన విలువ కలిగిన నిత్యావసర సరుకులు (పప్పులు, నూనె, గోధుమపిండి షాంపులు, సోపులు, వంటివి) ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. సింగల్ విండో చైర్మన్ చేకూరి జనార్దన్ చౌదరి మాట్లాడుతూ ప్రజలు సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్, కంపోస్టింగ్ చేయడం ద్వారా స్వర్ణ గ్రామాలకు ఆదాయం చేకూరుతుందన్నారు . తద్వారా గ్రామాలలో అభివృద్ధి పనులు చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకా దేవరాజులు, బండి విజయ్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రబాబు, బిల్ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, కార్యాలయ సిబ్బంది ఈశ్వర్, రేవంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు...

# గోటిగార్ పల్లిలో మురికి కాలువల శుభ్రత

**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం గోటిగార్ పల్లి గ్రామంలో ప్రతి వీధికి మురికి కాలువలను సర్పంచ్ విశ్వనాథ్ రాథోడ్, ఉప సర్పంచ్ మారుతీ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. ఈ పనులు ఉప సర్పంచ్ మారుతీ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తయ్యాయి. గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టారు. దీనివల్ల గ్రామంలో దోమల బెడద తగ్గి, ప్రజలకు మెరుగైన వాతావరణం లభిస్తుందని అధికారులు తెలిపారు.



# మహేశ్వరంలో ప్రతి ఆర్టీసీ బస్సు హాల్టింగ్ అవ్వాలి

**డిపో మేనేజర్ ప్రసూనా లక్ష్మికి వినతిపత్రం సమర్పణ..**



**నర్సంపేట,నేటిధాత్రి:** నర్సంపేట పట్టణ నూతన విలీన గ్రామం మహేశ్వరంలో ప్రతి ఒక్క ఆర్టీసీ బస్సు హల్టింగ్ ఇవ్వాలని డిపో మేనేజర్ ప్రసూనా లక్ష్మీకి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో చాలా మంది ఉద్యోగం,విద్యా,వైద్య నిమిత్తం హన్మకొండ, హైదరాబాద్ కి వెళ్తుంటారు. ఆర్టీసీ బస్సులు ఆగడంలేదు ఇందువలన నర్సంపేటకి వచ్చి బస్సు ఎక్కడం అవుతుందని తెలిపారు. అలాగే రాత్రి సమయాల్లో హన్మకొండ నుండి నర్సంపేటకి వచ్చే బస్సులు మహేశ్వరం వద్ద ఆపటం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి సమస్యకి పరిష్కారం చూపించి అన్ని బస్సులు ఆపే దిశగా చూస్తాఅని హామీ ఇచ్చారు. బస్సులు ఆపకుంటే అలాగే డిపో సమాచారం నెంబర్ కి కాల్ చేయాలని తెలిపారు. వినతిపత్రం అందచేసిన వారిలో కౌన్సిలర్లు మాత్రు రాథోడ్,భూస శిరీష-రాజు,గ్రామస్తులు చెన్న భాస్కర్,బేతం అఖిల్,చిదురాల చక్రపాణి ,వోర్తాల రాజు,బొల్ల శ్రీకాంత్, చెన్న గణేష్,చేరాల ప్రదీప్,భూక్య సాయి కళ్యాణ్ పాల్గొన్నారు.

# మంజీరా నదిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



**జహీరాబాద్,నేటిధాత్రి:** జహీరాబాద్ నియోజకవర్గం హద్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చాల్కి సమీపంలో గల మంజీర నదిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దోమ సుజిత్ తెలిపారు. నారాయణఖేడ్ డిపోలో పనిచేస్తున్న ఝరాసంగం మండలం కుప్పానగర్ గ్రామానికి చెందిన పాపయ్య ముదిరాజ్ నారాయణఖేడ్ బస్సు డిపోలో డ్రైవర్గా పనిచేస్తున్నాడు అని తెలిపారు. శుక్రవారం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరిన పాపయ్య మంజీర నది సమీపంలోకి వచ్చి కూతురితో బంధువులతో మాట్లాడి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో కాల్ ద్వారా తెలియపరిచాడు. బంధువులు కుటుంబ సభ్యులు అక్కడికి చేరేసరికి పాపయ్య మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆయన మృతదేహం లభించలేదు శనివారం సహాయక సిబ్బంది అక్కడికి చేరుకొని శవాన్ని తీశామని ఎస్సై తెలిపారు తర్వాత పంచనామా నిర్వహించి జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు శవాన్ని అప్పగించామన్నారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దోమ సుజిత్ తెలిపారు.

# వనపర్తి లో 5 రూపాయల భోజనం ఏర్పాటు చేయాలి

**మున్సిపల్ చైర్మన్ మాదవికి వినతిపత్రం**



**వనపర్తి ,నేటిధాత్రి:** వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రతిరోజు వేలాది గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం ప్రజలు వనపర్తికి వస్తుంటారని పేద ప్రజల ఆకలి తీర్చడానికి 5 రూపాయల భోజనం అమలు చేయాలని దళిత రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మిడిదొడ్డి మాధవి రమేష్ కు వినతి పత్రం అందజేశామని రాష్ట్ర అధ్యక్షులు సుమన్ చెప్పారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 రూపాయల భోజన పథకం హైదరాబాద్ గద్వాల్ నాగర్ కర్నూల్ రాష్ట్రవ్యాప్తంగా ఇంకా అనేక ప్రాంతాల్లో అమలు చేస్తున్నారని చైర్మన్ కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వనపర్తి లో 5 రూపాయల భోజనం పథకంపై తీర్మానం ప్రవేశపెట్టి వనపర్తి లో అమలు చేయాలని ఆయన చైర్మన్ ను కోరారు గతంలో వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డికి జిల్లా అధికారులకు ఐదు రూపాయల భోజనం అమలుపై వినతి పత్రాలు అందజేశామని ఆయన పేర్కొన్నారు వెంటనే వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి విధి విధానాలు రూపొందించి పేద ప్రజల ఆకలి తీర్చడానికి ఐదు రూపాయల భోజనం అమలు చేయుటకు సహకరించాలని వనపర్తి జిల్లా ప్రజల తరఫున సుమన్ విజ్ఞప్తి చేశారు వినతిపత్రం ఇచ్చిన వారిలో పిట్టల శ్రీను ఉందేకోటి బాలరాజు రాగి కొండన్న తదితరులు ఉన్నారని సుమన్ తెలిపారు

# ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బేగారి అరుణ్ కుమార్**




**నేటిధాత్రి,చేవెళ్ల:** చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో పలు ప్రైవేట్ కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా వేదిస్తున్నారని, అటువంటి వాటిపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్) చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బేగారి అరుణ్ కుమార్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలు(చేవెళ్ల, షాబాద్, శంకర్పల్లి, మొయినాబాద్)లలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు, అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు కట్టని పేరుతో హాల్ టికెట్ ఇవ్వకపోతే, లేదా స్కాలర్షిప్ పడలేదు అని వేధింపులకు గురి చేస్తే నిరంతరం విద్యార్థులకు ఉన్నటువంటి సమస్యల పైన పోరాటాలు చేసేటువంటి విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమేనని అన్నారు. అదేవిధంగా సమాచారం అందిన వెంటనే స్పందించి ఖచ్చితంగా ప్రవేట్ కళాశాలల యజమాన్యంతో మాట్లాడి హాల్ టికెట్ ఇప్పించడం కూడా జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల కార్యదర్శి మాల.చందు, మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, చేవెళ్ల మండల్ సహాయ కార్యదర్శి మణికంఠ, సోషల్ మీడియా ఇంచార్జి వినోద్, తరుణ్, సంతోష్ , వేణు రిశికిరణ్. తదితరులు పాల్గొనడం జరిగింది.

# వైసిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా జనార్దన్ యాదవ్



**తిరుపతి,నేటిధాత్రి:** వైయస్సార్సీపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామపంచాయతీ కి చెందిన చెరకుల జనార్దన్ యాదవ్ ను వైయస్సార్సీపి రాష్ట్ర పార్టీ నియమించారు. జనార్దన్ యాదవ్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బీసీలలో మంచి పట్టున్న నాయకుడు. గత మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం జనార్ధన్ యాదవ్ ది. వైయస్సార్సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు. తిరుపతి రూరల్ మండలం తో పాటు నియోజకవర్గంలోని మిగిలిన మండలాలలో పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారు. జనార్ధన్ యాదవ్ కు బీసీలలో మంచి పట్టు ఉండడంతో పార్టీ అధిష్టానం గుర్తించి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు యాదవ్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా బీసీలను పార్టీ పట్ల ఆకర్షితులను చేసేందుకు ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం రాష్ట్ర బీసీ సెల్ విభాగంలో కీలక పదవిని కట్టబెట్టారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తో పాటు చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లతో పాటు రాష్ట్ర ముఖ్య నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్దన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పర్యటించి బీసీలను వైసీపీ పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చేయడంతో పాటు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో పర్యటించి బిసి కమిటీలను వెయ్యనున్నట్లు తెలిపారు..

# ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులు



**జహీరాబాద్,నేటిధాత్రి:** తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ ఈ మేరకు మండలాల్లోని నూతన సర్పంచులకు ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు సంగారెడ్డి దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం కార్యాలయంలో 5 రోజుల పాటు గ్రామ పాలన, పంచాయతీ రాజ్ 2018 చట్టం పై శిక్షణ తరగతులు నిర్వహించారు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ తరగతలు ఉండగా.జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం కోహిర్ మొగుడంపల్లి నాల్కర్ జహీరాబాద్ సర్పంచులు అందరూ హాజరు అయ్యారు. అంతేకాకుండా పంచాయతీ పాలనలోని వ్యవస్థలు, గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచ్ల విధులు వంటి 24 అంశాలపై అవగాహన కనిపిస్తూ. ఒకో సర్పంచ్కు ఐదు రోజులు శిక్షణ పొంది ,ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.సర్పంచుల శిక్షణ ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గారి తో ఝరాసంగం మండల సర్పంచులు.. తుమ్మన్ పల్లి గ్రామ సర్పంచ్ నజియా అంజూమ్ షేక్ సోహెల్ ఝరాసంగం గ్రామ సర్పంచ్ వినోద బాలరాజ్ మేదపల్లి సర్పంచ్ మరియు ఆయా గ్రామాల సర్పంచ్లు పాల్గొన్నారు,

# స్వయం పరిపాలన దినోత్సవం

**కాంప్లెక్స్ హెచ్ఎం బండారు నరేందర్**



**కేసముద్రం,నేటిధాత్రి:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమైన అంశం స్వయం పాలన అని కలవల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ అన్నారు. మండలంలోని పీక్ల తండా శివారు ఎంపీపీ ఎస్ బోడగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...స్వయం పరిపాలన అంటే మనం మన పనులను మనమే బాధ్యతగా నిర్వహించుకోవడ మన్నారు. ఇది ప్రతి వ్యక్తి తన బాధ్యతలను తెలుసుకుని, సమాజ అభివృద్ధికి కృషి చేయడం స్వయం పరిపాలన యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ దినోత్సవం ద్వారా మనం విద్యార్థులకు నాయకత్వ గుణాలు, క్రమశిక్షణ, బాధ్యతాభావం వంటి విలువలను నేర్పించ బడతాయన్నారు. ఈ రోజు విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషిస్తూ తరగతులను నిర్వహించడం ద్వారా నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారు అన్నారు. విద్యార్థులు స్వయంగా పాఠాలు చెప్పడం, సమయపాలన పాటించడం, ఇతరులను గౌరవించడం వంటి అంశాలు నేర్చు కోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలన్నారు. అలాగే, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, పాటలు, నృత్యాలు, ప్రసంగాలు వంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తున్నాయని, ఇవి మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. మనం నేర్చుకున్న విలువలను జీవితంలో అమలు చేస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమ బహుమతులను గనె పావన అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ డివి రమణ ఉపాధ్యాయుడు గనె యాదగిరి, బహుమతి దాత గనె పావన, ఉపాధ్యాయులు గుగులోతు మైబు, గుగులోత్ శిరీష, గుగులోతు నీల, బానోతు పద్మ, నేటి ఎంఈఓ జి మనీష్, నేటి హెచ్ఎం, జి వసంత ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# చిత్తూరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం

**జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర సమగ్రాభివృద్ధి కోసమే సీసీ రోడ్ల నిర్మాణం..**
**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్..**
**లాయర్స్ కాలనీలో సిసి రోడ్లను ప్రారంభించిన ఎంపీ ఎమ్మెల్యేలు..**



**చిత్తూరు,నేటిధాత్రి:** జిల్లా కేంద్రమైన చిత్తూరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు.సీసీ రోడ్ల నిర్మాణంతోనే చిత్తూరు నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.చిత్తూరు నగర పరిధిలోని 4వ డివిజన్ లాయర్స్ కాలనీలో 19-30 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, మురుగు కాలువలను శనివారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై, ప్రారంభించారు. అంతకుముందు లాయర్స్ కాలనీకి చేరుకున్న ఎంపీ ఎమ్మెల్యేలకు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం సీసీ రోడ్లు , మురుగు కాలువల ప్రారంభోత్సవ అనంతరం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా కేంద్రమైన చిత్తూరు ప్రగతి పై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఇందులో భాగంగానే తాము చిత్తూరు నగర సర్వతో ముఖాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలను చేపట్టి దశలవారీగా చేపట్టి పూర్తి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద ,చూడ ఛైర్పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి, టిడిపి సీనియర్ నేత కాజూరు బాలాజీ, టిడిపి రాష్ట్ర మహిళా నేత వై.వి.రాజేశ్వరి , మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజు , మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ యాదవ్, ఆడిటర్ కేశవులు నాయుడు ,టిడిపి నాయకులు గురజాల సురేష్ ,టిడిపి నగరాధ్యక్షులు నరేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప , కార్పోరేటర్లు ఇందు,టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు టి ఆర్ జనార్దన్ నాయుడు, వార్డు టిడిపి ఇంచార్జ్ నాగలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి శాప్ చెస్ లీగ్

**ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న శాప్ చైర్మన్ రవి నాయుడు...**



**తిరుపతి,నేటిధాత్రి:** ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి శాప్ చెస్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు మరియు తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పనబాక లక్ష్మి తో కలిసి శాప్ చైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రీడలకు కొత్త దిశ, కొత్త ఆలోచన, కొత్త ఉద్యమంగా శాఫ్, లీగ్ రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా అభివృద్ధి లక్ష్యంగా శాప్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ లీగ్‌లో భాగంగా తిరుపతిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ లీగ్ లో రాణిస్తున్న ప్రతిభావంతులను వెలికి తీసి, రానున్న రోజుల్లో శాప్ అకాడమీల్లో ప్రవేశాలు కల్పించడమే ఈ లీగ్ ప్రధాన లక్ష్యమని హామీ ఇచ్చారు.ఫిబ్రవరి 17, 2026న రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా స్థాయి చెస్ ఎంపికలు నిర్వహించగా, 2,445 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.ఇది కేవలం ఒక లీగ్ కాది ఇది ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తుకు వేసిన పునాది అని రవి నాయుడు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్ తిరుపతి గంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్ తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య ఐఏఎస్ ,శాప్ ఎండి భరిణి ఐ ఎఫ్ యస్, ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటా వాసు గారు, తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సభ్యులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సభ్యులు, క్రీడాకారులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు...

# మొకిలా గిరిజనరైతులకు న్యాయం చెయ్యాలి

**సీపీఐ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేత**



**శంకర్పల్లి,నేటిధాత్రి:** శంకర్ పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామం పొన్నగుట్ట తాండ గిరిజన రైతులు తమకు ప్రభుత్వం నుండి వచ్చిన అసైన్డ్ భూములను ఈ మధ్యకాలంలో ప్రభుత్వం తీసుకొని ఎకరాకు 800 గజాల చొప్పున రైతులకు ఇస్తుందని, ఒరిజినల్ పట్టాదారులను ప్రభుత్వం వదిలేసి ఎలాంటి సంబంధం లేని వారిని చేర్చి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని శనివారం రోజున సిపిఐ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ గిరిజన రైతులను మోసం చేయాలని చూస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకొని గిరిజన రైతులకు న్యాయం చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం, శంకరపల్లి మండల కార్యదర్శి పి సుధీర్ మరియు నాయకులు రాజేందర్ గౌడ్ బద్దం శివారెడ్డి రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుడు కుటుంబానికి ఆర్థిక సహాయం



నేటిధాత్రి,యాదగిరిగుట్ట: ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన ఆటో కార్మికుడు బోనాల బిక్షపతి గారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బిర్లా ఫౌండేషన్ చైర్మన్ బిర్లా అనిత గారు 50 కిలోల బియ్యాన్ని ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ భీర్ల ఐలయ్య గారి ఆదేశాల మేరకు ఆ కుటుంబానికి ఇవ్వడం జరిగింది అలాగే ఐదో వార్డు కౌన్సిలర్ బిట్టు సరోజ హరీష్ గారు 5000 రూపాయలను ఆర్థిక సాయం అందించడం జరిగింది అలాగే కోమటిరెడ్డి యువసేన యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ధార నవీన్ గారు 50 కిలోల బియ్యాన్ని ఇవ్వడం జరిగింది అలాగే నాచీూ ఆటో యూనియన్ తరపున 2000 ఖజ ఆటో యూనియన్ తరపున 2000 అతని కుటుంబానికి అప్పజెప్పడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ, యూనియన్ అధ్యక్షులు కళ్లెం సిద్ధులు గౌడ్, రాంపల్లి రజనీకాంత్ గౌడ్ ఈరోజు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది.




# స్టార్ హీరోహీరోయిన్లకు మించిన క్రేజ్




ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై దూసుకుపోతున్న సీరియల్ గుండె నిండా గుడిగంటలు. అత్యధిక టీఆర్పీ రేటింగ్ తో ఈ సీరియల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణ మధ్య తరగతి కుటుంబ కథతో సాగుతున్న ఈ సీరియల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ సీరియల్ కు రోజు రోజుకీ విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇక ఇందులో ప్రధాన పాత్రలు బాలు, మీనా జోడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మీనా గురించి చెప్పుకుంటే.. అందంతోపాటు పద్ధతిగా చీరకట్టులో కనిపిస్తూ అద్భుతమైన నటనతో కట్టిపడేస్తుంది. మీనా అసలు పేరు అమూల్య గౌడ. కన్నడ సినీరంగానికి చెందిన ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఫాలోయింగ్ ఎక్కువే. సీరియల్లో పద్ధతిగా కనిపించే అమూల్య.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. నెట్టింట ఈ అమ్మడు చేసే అరాచకం గురించి చెప్పక్కర్లేదు. మైసూర్ కు చెందిన అమూల్య గౌడ.. దాదాపు పదేళ్ల క్రితం సినీప్రయాణం స్టార్ట్ చేసింది. కన్నడ సీరియల్ స్వాతి ముత్తుతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత కోమలి సీరియల్ ద్వారా ఫేమ్ సంపాదించుకుంది. కన్నడలో పలు సీరియల్స్ చేసిన ఈ అమ్మడు.. కార్తీక దీపం సీరియల్లో శౌర్య పాత్రతో తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. ఇందులో రౌడీ బేబీగా మరింత పాపులర్ అయ్యింది. ఆ తర్వాత గుండె నిండా గుడిగంటలు సీరియల్లో మీనా పాత్రతో మరింత పాపులర్ అయ్యింది. ఈ సీరియల్ ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ప్రస్తుతం ఈ సీరియల్ విజయవంతంగా దూసుకుపోతుంది. ఇక ఇప్పుడు ఆమె సోషల్ మీడియాలో గ్లామర్ లుక్స్ తో హీటెక్కిస్తుంది. ఇదిలా ఉంటే.. అమూల్య గౌడ ఒక్క ఎపిసోడ్ కోసం రూ. 30 నుంచి రూ. 35 వేలు తీసుకుంటుందట. ఇప్పుడు ఈ విషయం తెలిసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.




# ‘గోపీ సార్ నా మెంటర్’.. ట్రైలర్ ఈవెంట్‌లో కన్నీళ్లు పెట్టుకున్న వరలక్ష్మి శరత్‌కుమార్




కోలీవుడ్ మ్యాచో మ్యాన్ శరత్ కుమార్ ముద్దుల కూతురు వరలక్ష్మీ శరత్ కుమార్ నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. పోడా పొడి సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన వరలక్ష్మి, తమిళంతో పాటు కన్నడ, మలయాళ చిత్రాల్లోనూ నటించి మంచి పేరు సంపాదించారు. అయితే కమర్షియల్ హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం దక్కలేదు. తరువాత ‘పందెంకోడి 2’ లో కీలక పాత్ర పోషించడంతో తన కెరీర్ కీలక మలుపు తిరిగింది. ఆ తర్వాత హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలు, క్యారెక్టర్ ప్రాధాన్య చిత్రాల్లో నటిస్తూ ముందుకు సాగారు. అయితే ఆమెకు నిజమైన బ్రేక్ ఇచ్చింది మాత్రం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో వచ్చిన క్రాక్ మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన ఈ చిత్రంలో ‘జయమ్మ’ పాత్రలో వరలక్ష్మి అద్భుత నటనతో మెప్పించారు. ఈ పాత్ర ఆమెకు తెలుగులో మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ప్రముఖ నటులు కూడా ఆమె నటనను ప్రశంసించారు. ఇప్పుడు వరలక్ష్మి నటిగా మాత్రమే కాకుండా దర్శకురాలిగానూ మరో అడుగు వేస్తున్నారు. ఆమె నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘స్రవంతి’. ఈ సినిమాలో ప్రియమణి, కిషోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమం రీసెంట్‌గా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోపీచంద్ మలినేనిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతుండగా ఎమోషనల్ అయ్యారు. “గోపీ సార్ నా స్నేహితుడు, గురువు, మెంటర్. ఆయన వల్లే నేను తెలుగులో రీలాంచ్ అయ్యాను. ఆయన నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు. ఎప్పటికీ ఆయనను అభిమానిస్తూనే ఉంటాను” అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. తెలుగు ప్రేక్షకులు తనను ఎంతగానో ఆదరించారని, ఈ సినిమాను పెద్ద స్థాయిలో ప్రమోట్ చేయాలని ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ఇండస్ట్రీలో మహిళలు మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. తన ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ‘క్రాక్’లో జయమ్మ పాత్రతో మెగాస్టార్ సహా పలువురి ప్రశంసలు అందుకున్న వరలక్ష్మి, ఇప్పుడు దర్శకురాలిగా కొత్త ప్రయాణం మొదలుపెట్టడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. నటిగా సత్తా చాటిన ఆమె, దర్శకురాలిగా ఎలాంటి మ్యాజిక్ చూపిస్తారో చూడాలి.

# భార్యపై ప్రేమను చాటుకున్న నిక్ జోనస్



తన భార్య, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సంస్కృతిని గౌరవిస్తూ ఆయన చేసిన ఈ పని ఇప్పుడు నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. పురుషులు కూడా ఇలా చేయవచ్చా? అని అందరూ ఆశ్చర్యపోయేలా చేసిన ఆ విశేషాలేంటో చూద్దాం.. ఆయన ఒక గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్. ఆమె ప్రపంచం మెచ్చిన భారతీయ నటి. వీరిద్దరి జోడీ అంటేనే ఒక సెలబ్రేషన్. తాజాగా ఆ పాప్ సింగర్ తన భార్య నటిస్తున్న ‘ద బ్లఫ్’ సినిమాలోని ‘బ్లడీ మేరీ’ పాత్రకు గుర్తుగా ఒక కాక్టెయిల్ తయారు చేస్తున్న వీడియోను షేర్ చేశారు. అయితే, అందరి దృష్టి ఆ కాక్టెయిల్ మీద కంటే ఆయన మణికట్టుపై ఉన్న ఒక నల్లపూసల గొలుసు మీదకు వెళ్లింది. హిందూ సంప్రదాయంలో కేవలం మహిళలు మాత్రమే ధరించే మంగళసూత్రాన్ని ఆయన బ్రాస్‌లెట్ రూపంలో ధరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పాప్ స్టార్ మరెవరో కాదు.. నిక్ జోనస్. సాధారణంగా మంగళసూత్రం అంటే వివాహితలకు చిహ్నం. నల్లపూసలు, బంగారు సూత్రాలతో ఉండే ఈ పవిత్ర బంధం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో సోనమ్ కపూర్ తన రాశి చక్రంతో కూడిన మంగళసూత్రాన్ని ఎంచుకోగా, ఆలియా భట్ తన హారంలో ఇన్ఫినిటీ గుర్తును చేర్చుకుంది. రాధికా మర్చంట్ సైతం తన మంగళసూత్రాన్ని బ్రాస్‌లెట్‌గా ధరించి ఆశ్చర్యపరిచింది. అయితే, ఇప్పుడు నిక్ జోనస్ దానిని ధరించడం ద్వారా ఒక సరికొత్త చర్చకు తెరలేపారు. పెళ్లయిన వస్తువులను, గుర్తులను కేవలం మహిళలు మాత్రమే ధరించాలా? అనే చర్చ ఎప్పటి నుంచో ఉంది. చాలామంది పురుషులు పెళ్లి ఉంగరాలను కూడా పెట్టుకోవడానికి ఇష్టపడని ఈ రోజుల్లో, నిక్ జోనస్ తన భార్య దేశపు సంప్రదాయాన్ని తన మణికట్టుపై ధరించడం విశేషం. ఇది కేవలం స్టైల్ కోసం చేసిన ప్రయత్నం కాదు, తన భార్య నమ్మకాల పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి, ప్రేమకు నిదర్శనం. భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అనే భావనను ఆయన ఈ చిన్న చర్య ద్వారా చాటిచెప్పారు. నిక్ జోనస్ ప్రభావంతో ఇప్పుడు పురుషుల మంగళసూత్ర బ్రాస్‌లెట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని ప్రముఖ జ్యువెలరీ డిజైనర్లు చెబుతున్నారు. చాలామంది పురుషులు ఇప్పుడు తమ సంబంధాల్లో సమానత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకే ఇలాంటి ఆభరణాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారని ‘డిఐ డిజైన్స్’ ఫౌండర్ దిశా షా పేర్కొన్నారు. త్వరలోనే పురుషుల కోసం ప్రత్యేకంగా మంగళసూత్ర కలెక్షన్‌ను లాంచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు ఆమె వెల్లడించారు. లోకమంతా టెక్నాలజీ, ఆధునికత వైపు పరుగులు తీస్తున్నా.. తమ మూలాలను, ఎదుటివారి సంస్కృతిని గౌరవించడమే నిజమైన ప్రేమ అని నిక్ జోనస్ నిరూపించారు. కేవలం సినిమా ప్రమోషన్ కోసం కాకుండా, మనసు నిండా ఉన్న ప్రేమతో ఆయన చేసిన ఈ పనికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. పెళ్లి ఉంగరాలను ఇంట్లో మర్చిపోయే భర్తల కంటే, ఇలా భార్య సంస్కృతిని సొంతం చేసుకునే నిక్ జోనస్ లాంటి భర్తలు కావాలంటూ మహిళలు కామెంట్స్ చేస్తున్నారు.

# కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది



‘ధమాకా’ తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ- అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన ‘భగవంత్ కేసరి’ హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు.’స్కంద’ ‘ఆదికేశవ’ ‘ఎక్స్ట్రా ఆర్డియనరీ మెన్’ ‘గుంటూరు కారం’ ‘రాబిన్ హుడ్’ ‘జూనియర్’ ‘మాస్ జాతర’ ‘పరాశక్తి’ ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది. అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాకి సంబంధించి శ్రీలీల తన పాత్రకి డబ్బింగ్ చెప్పడం కూడా పూర్తయ్యింది. ఈ ఒక్క సినిమా హిట్ అయితే.. శ్రీలీల ఫ్లాప్స్ నుండి బయట పడినట్టే. దర్శకుడు హరీష్ శంకర్ కి కూడా ఫ్లాప్స్ లో ఉన్న హీరోయిన్స్ ని బయటపడేసిన ట్రాక్ రికార్డ్ ఉంది. సో శ్రీలీలకి గుడ్ టైమ్ స్టార్ట్ అయినట్టే...!

# పవర్‌ఫుల్ లాయర్‌గా తాప్సీ పన్ను




ఒకప్పుడు తన అందాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు ఉత్తరాది భామ తాప్సీ పన్ను. కానీ అందరు హీరోయిన్ల మాదిరిగానే ఆమెకు బాలీవుడ్‌పై మోజు పుట్టి అక్కడే సెటిలైపోయింది. ఒకటి రెండు హిట్లు తప్పించి హిందీ చిత్ర పరిశ్రమలో తాప్సీ కెరీర్‌లో పెద్దగా మెరుపులు లేవు. కానీ ఏదో కిందా మీదా పడుతూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు తాప్సీ. దోబారా, తడ్కా, బ్లర్, ధక్ ధక్, డూంకీ, ఖేల్ ఖేల్ మై తదితర సినిమాలలో ఆమె నటించారు. తాజాగా తాప్సీ పన్ను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం అస్సీ. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల బ్యాక్‌డ్రాప్‌లో యదార్థ ఘటనల తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ మూవీ అస్సీ. కోర్ట్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో తాప్సీ పన్ను పవర్‌ఫుల్ లాయర్‌గా నటించారు. ఫిబ్రవరి 20వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. టీ సిరీస్ ఫిల్మ్స్, బెనారస్ మీడియా వర్క్స్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కృషన్ కుమార్, అనుభవ్ సిన్హాలు సంయుక్తంగా అస్సీ మూవీని నిర్మించగా.. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. తాప్సీతో పాటు కని కుస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా, కుముద్ మిశ్రా, మహమ్మద్ జీషన్ ఆయూబ్, సత్యజిత్ శర్మ, విపుల్ గుప్తా తదితరులు కీలకపాత్రలు పోషించారు. సీతా పహ్వా, సుప్రియ పాఠక్, నసీరుద్దీన్ షాలు గెస్ట్ రోల్‌లో అలరించారు. ఈవారం ముల్లిగన్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా.. అమర్జిత్ సింగ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. రంజిత్ బరత్ సంగీత దర్శకత్వం వహించారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషం, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ కార్యక్రమాలతో కలిపి అస్సీ మూవీకి 40 కోట్ల రూపాయల బడ్జెట్ అయ్యింది. టీజర్, ట్రైలర్ తదితర ప్రమోషనల్ కార్యక్రమాలతో అస్సీ మూవీకి ఓ మాదిరిగా థియేట్రికల్, నాన్ థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా లాభాల్లోకి రావాలంటే బాక్సాఫీస్ వద్ద 80 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టాల్సి ఉందని ట్రేడ్ పండితులు వాల్యూ నిర్దేశించారు.

# విష్ణు విన్యాసానికి లైన్ క్లియర్..

శ్రీవిష్ణు నటించిన ‘మృత్యుంజయ్’, ‘విష్ణు విన్యాసం’ చిత్రాలు ఒకే రోజు వ్యవధిలో విడుదల కానుండటంతో ట్రేడ్ వర్గాల్లో టెన్షన్ నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ క్లాష్‌ను నివారించడానికి మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మృత్యుంజయ్ చిత్రాన్ని వాయిదా వేశారు. కొత్త విడుదల తేదీని ప్రకటించారు. మరోవైపు విష్ణు విన్యాసం సినిమాను ఒక రోజు ముందుగా రిలీజ్ చేస్తున్నారు. దీనివల్ల శ్రీవిష్ణు ఒక సినిమా ప్రమోషన్స్ ముగించుకుని, మరో సినిమా ప్రచారానికి సమయం కేటాయించే అవకాశం లభించింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన రెండు సినిమాలు ఒకే సమయంలో, ఒక్క రోజు గ్యాప్ లో విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న మృత్యుంజయ్.. 28న విష్ణు విన్యాసం మూవీని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అఫిషియల్ గా అనౌన్స్ చేశారు. ఇలా ఒకే హీరోకి చెందిన రెండు చిత్రాలు ఒకేసారి థియేటర్లలోకి రావడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. అందుకే గత కొన్ని రోజులుగా ‘శ్రీవిష్ణు ఒం శ్రీవిష్ణు’ అంటూ పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. అయితే ఇలాంటి సంకట పరిస్థితి నుంచి శ్రీవిష్ణు బయటపడ్డారు. గతంలో నందమూరి బాలకృష్ణ నటించిన బంగారు బుల్లోడు, నిప్పురవ్వ సినిమాలు ఒకే రోజు రిలీజ్ అవ్వగా.. వాటిల్లో ఒకటి హిట్టవ్వగా, మరొకటి ఫ్లాప్ అయింది. ఆ తర్వాత నాని నటించిన ఎవడే సుబ్రమణ్యం, జెండాపై కపిరాజు చిత్రాలను ఒకే రోజు విడుదల చేశారు. అందులో ఒకటి




మాత్రమే సక్సెస్ సాధించింది. దీంతో మృత్యుంజయ్ ఒ విష్ణు విన్యాసం సినిమాల మధ్య పోటీ ఏర్పడుతుందని తెలియడంతో, రెండింటిలో ఏది ప్రేక్షకాదరణ దక్కించుకుంటుందో అని ట్రేడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆ రెండు సినిమాల్లో ఒకటి వాయిదా పడింది.

# రూమర్లపై కౌంటర్ ఇచ్చిన మీనా

తనపై వస్తున్న అనవసర రూమర్లకు ఈసారి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు సీనియర్ హీరోయిన్ మీనా. చాలా కాలం పాటు దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన మీనా, తాజాగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు కథనాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే మీనా, ఈసారి మాత్రం తన సహనాన్ని పరీక్షిస్తున్నారని స్పష్టంగా చెప్పుకొచ్చారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, ఆపై హీరోయిన్‌గా స్టార్ స్టేటస్ అందుకున్న మీనా. సీతారామయ్య గారి మనవరాలు, చంటి, అబ్బాయిగారు, అల్లరి అల్లుడు, ముత్తు వంటి చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారు. ఇప్పటికీ క్యారెక్టర్ రోల్స్, కీలక పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల మీనా రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న కథనాలు ఆమెను తీవ్రంగా కలచివేశాయట. వ్యక్తిగత జీవితంలో ఇప్పటికే పెద్ద విషాదాన్ని ఎదుర్కొన్న మీనా, మళ్లీ ఇలాంటి అసత్య ప్రచారాలు తనను మానసికంగా బాధిస్తున్నాయని తెలిపారు. “నిజం ఏంటో తెలుసుకోకుండా, మీ ఇష్టం వచ్చినట్లు కథలు అల్లడం ఎంతవరకు కరెక్ట్ ?” అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఒక ఒంటరి మహిళనని, అంతేకాదు ఒక కుమార్తె తల్లినని గుర్తుచేశారు. ఈ వార్తలు తన కూతురు చూసినప్పుడు ఆమె మనసుపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఆలోచించాలంటూ మీడియా, సోషల్ మీడియాను కోరారు. ఇలాంటి రూమర్లకు




స్పందించి తన సమయం, ఆరోగ్యం, ఎనర్జీని వృథా చేసుకోవాలని తనకు లేదని, పాజిటివ్‌గా జీవించడమే తన లక్ష్యమని మీనా స్పష్టం చేశారు. “కర్మ అనేది ఉంటుంది అని అది ఎవరినీ వదిలిపెట్టదు” అనే ఆమె మాటలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మొత్తానికి ఎప్పుడూ సైలెంట్‌గా ఉండే మీనా ఇలా ఫైర్ అవ్వటం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఇకనైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆగిపోవాలని ఆమె స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్టే భావించాలి.

# డయాబెటిస్ ఉన్నవారికి అద్భుతంగా పనిచేసే మూలికలు..



మారిన జీవనవిధానం, ఆహారపు అలవాట్ల కారణంగా తలెత్తే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల్లో డయాబెటిస్ కూడా ఒకటి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్య బారిన పడుతున్నారు. డయాబెటిస్ బారిన పడితే జీవితాంతం మందులు మింగాల్సిందే. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండడం వల్ల శరీరంలో ఇతర అవయవాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. కనుక డయాబెటిస్ ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని రకాల మూలికలను వాడడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడడంతో పాటు తీపి తినాలన్న కోరిక కూడా తగ్గుతుందని వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ మూలికలను తీసుకోవడం వల్ల అడాప్టోజెన్ ఒత్తిడి తగ్గడంతో పాటు జీవక్రియ కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచే మూలికలు ఏమిటో.. ఇప్పుడు తెలుసుకుందాం.బ్లడ్ షుగర్ మానిటర్స్

### మెంతులు, దాల్చిన చెక్క..

రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో మెంతులు మనకు ఎంతో సహాయపడతాయి. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది చక్కెర శోషణను నెమ్మదిస్తుంది. మెంతులను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీతో పాటు ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు, శరీర జీవక్రియ కూడా మెరుగుపడుతుంది. క్రమం తప్పకుండా మెంతి నీటిని తీసుకోవడం, మెంతులను నానబెట్టి తీసుకోవడం, వంటల్లో మెంతులను వాడడం వల్ల టైప్ 2 డయాబెటిస్ అదుపులో ఉంటుంది. రోజూ అర టీ స్పూన్ దాల్చిన చెక్క పొడిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సామర్థ్యం పెరుగుతుంది. భోజనం తరువాత వచ్చే గ్లూకోజ్ స్పైక్స్ తగ్గుతాయి. ఓట్ మీల్, స్మూతీ, మసాలా టీ వంటి వాటితో దాల్చినచెక్క పొడిని కలిపి తీసుకోవడం వల్ల రుచిగా ఉండడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అయితే దాల్చిన చెక్క ప్రతికూల ప్రభావాలను కూడా చూపిస్తుంది కనుక దీనిని తక్కువ మోతాదులో తీసుకోవడం చాలా అవసరం.

### పొడపత్రి, కాకరకాయ..

అలాగే మధునాశిని అని పిలువబడే మూలికను తీసుకోవడం వల్ల తీపి తినాలనే కోరిక తగ్గుతుంది. దీనిని పొడపత్రి అని కూడా పిలుస్తారు. ఈ మొక్క ఆకులను నమలడం లేదా టీ లో వేసి తీసుకోవడం వల్ల చక్కెర శోషణ తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కాకరకాయ కూడా మనకు సహాయపడుతుంది. పరగడుపున కాకరకాయ జ్యూస్ తాగడం వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. తులసి ఆకులను నేరుగా నమలడం లేదా కషాయం చేసి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు సమతుల్యంగా ఉంటాయి. తులసి ఆకులను తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కార్టిసాల్ స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అలోవెరా జ్యూస్ ను తాగడం వల్ల ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి. పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జ్యూస్ మాత్రమే కాకుండా అలోవెరా సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది.

### జాగ్రత్తలు తప్పనిసరి..

మనుపసుపు అనే మూలిక కూడా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే శక్తివంతమైన బయోయాక్టివ్ సమ్మేళనాలను కలిగి ఉంటుంది. దీనిని దారుహరిద్ర అని కూడా పిలుస్తారు. దీనిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. వేపను తీసుకోవడం వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు సహజంగా తగ్గుతాయి. వేపను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ గ్రాహక శక్తి పెరుగుతుంది. ఈ విధమైన మూలికలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ మూలికలను తీసుకునే విషయంలో జాగ్రత్త అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ మూలికలను తీసుకోవడం నెమ్మదిగా ప్రారంభించాలి. మొదటగా ఒక్క మూలికను మాత్రమే తీసుకోవాలి. మన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తాజాగా, పొడిగా లేదా టీ రూపంలో తీసుకోవాలి. వేప, కాకర వంటి వాటిని పరగడుపున తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. డయాబెటిస్ కు ముందు నుండే మందులు వాడే వారు ఈ మూలికలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ, రోజూ వ్యాయామం చేస్తూ ఈ మూలికలను తీసుకోవడం వల్ల మరిన్ని మంచి ఫలితాలను చూడవచ్చు.

# వెల్లుల్లి రెబ్బలను ఇలా తయారు చేసి తాగండి



వెల్లుల్లిపాయలను మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. వీటి వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. వెల్లుల్లి వంటకాలకు రుచిని అందించడమే కాదు, మనకు ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఇస్తుంది. అందుకనే రోజూ ఉదయం 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తినాలని చెబుతుంటారు. అయితే వెల్లుల్లి ఘాటుగా ఉంటుంది కనుక దాన్ని తినడం చాలా మందికి కష్టంగా ఉంటుంది. కానీ వెల్లుల్లి రెబ్బలను నీటిలో వేసి మరిగించి డికాషన్‌లా తయారు చేసి తాగవచ్చు. ఇందులోనే అవసరం అనుకుంటే రుచి కోసం కాస్త తేనె కలిపి తాగవచ్చు. ఈ వెల్లుల్లి రెబ్బల టీని రోజుకు ఒక కప్పు మోతాదులో తాగాలి. దీన్ని తాగడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. మనకు కలిగే పలు వ్యాధులను నయం చేయడంలో వెల్లుల్లి ఎంతగానో పనిచేస్తుంది.

# సపోటా పండ్లలో అనేక పోషకాలు



ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. అందులో భాగంగానే మనకు ఏడాది పొడవునా లభించే పండ్లతోపాటు సీజన్లను బట్టి లభించే పండ్లు కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. అయితే కొన్ని రకాల పండ్లను చాలా మంది తినేందుకు అంతగా ఇష్టపడరు. అలాంటి పండ్లలో సపోటా పండ్లు కూడా ఒకటి. ఇవి తియ్యగా ఉన్నప్పటికీ చాలా మంది వీటిని తినరు. కానీ సపోటా పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు. సపోటా పండ్లలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల సపోటా పండ్లను తింటే సుమారుగా 140 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 34 గ్రాములు, చక్కెరలు 15 గ్రాములు, ఫైబర్ 9 గ్రాములు, ప్రోటీన్లు 1 గ్రాము, కొవ్వులు 2 గ్రాములు లభిస్తాయి.

# కలిపి తీసుకుంటే కష్టమే!



మాంసాహారం, పాలు ఒకేసారి తీసుకోవద్దని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం మాంసాహారం-పాలను 'విరుద్ధ ఆహారం'గా పిలుస్తారట. అందుకే, ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే లేనిపోని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ఇందుకు కారణాలు చెబుతూ.. మాంసం వేడిచేసే గుణాన్ని కలిగి ఉంటుంది. పాలు చలువ చేస్తాయి. కాబట్టి, ఈ రెండూ కలిపి తీసుకున్నప్పుడు జీర్ణ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా.. పాలు, మాంసంలో ప్రొటీన్స్, పోషకాలు రెండూ అధిక మొత్తంలో ఉంటాయి. కాబట్టి, ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల.. జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. కడుపు ఉబ్బరం, అజీర్ణం, కడుపు నొప్పి, వికారం లాంటి సమస్యలు ఎదురవుతాయని అంటున్నారు. కొందరిలో గుండెల్లో మంట కూడా వస్తుందట. కాబట్టి, మాంసాహారం తిన్న తర్వాత కనీసం 2 నుంచి 3 గంటల విరామం ఇచ్చిన తర్వాతే పాలు తాగడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక చేపలు తిన్న తర్వాత పాలు తాగితే.. తీవ్రమైన అలర్జీలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

# ఓట్స్ ను రోజూ తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే.. మిస్ చేసుకోకుండా తినండి..!

మన ఆరోగ్యానికి మేలు చేసే తృణ ధాన్యాలల్లో ఓట్స్ కూడా ఒకటి. వీటిలో బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్ తో పాటు అవెనాంత్రామైడ్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, షుగర్ ను అదుపులో ఉంచడంలో, బరువును తగ్గించడంలో, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా ఓట్స్ మనకు సహాయపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఓట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

ఓట్స్ ను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ఫైబర్ పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను బంధిస్తుంది. తద్వారా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ దాదాపు 5 నుండి 10 శాతం వరకు తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఓట్స్ ను తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ రక్తంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు రాకుండా ఉంటాయి. అలాగే ఓట్స్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ ధమనుల ఆరోగ్యానికి మద్దతును ఇస్తుంది. దీంతో సిస్టోలిక్ బిపి అదుపులో ఉంటుంది. ఓట్స్ ను 8 వారాల పాటు తీసుకోవడం వల్ల



సిస్టోలిక్ బీపీ 2 నుండి 3 ఎమ్ఎమ్ హెచ్‌జి వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

### బరువు తగ్గాలంటే..

అధిక రక్తపోటుతో బాధపడే వారు ఓట్స్ ను రోజూ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఓట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో మనం క్యాలరీలను తక్కువగా తీసుకుంటాం. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఓట్స్ ను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఓట్స్ లో మెగ్నిషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. ఇలా అనేక రకాలుగా ఓట్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు.విటమిన్ సప్లిమెంట్లు

# మన వంటల్లో చింతకాయలను ఉపయోగిస్తే ఎక్కువ మేలు

చింత పండను మనం వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. పప్పు, చారు, సాంబార్ వంటి వంటలతోపాటు పులిహోర, స్వీట్లు, పులుసు వంటి వంటల్లోనూ చింత పండును వేస్తుంటారు. ఇది చాలా పుల్లగా ఉంటుంది కనుక వంటల్లో వేసి పులుపు కోసం ఉపయోగిస్తుంటారు. చింత పండును వేస్తే వంటలకు చక్కని రుచి వస్తుంది. అయితే మీకు తెలుసా..? చింత పండు కన్నా చింత కాయల్లోనే అధిక ఔషధ గుణాలు ఉంటాయని ఆయుర్వేదం చెబుతోంది. మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు చింతకాయల్లో ఉంటాయి. చింతపండు కన్నా చింతకాయలను ఉపయోగిస్తేనే ఎక్కువ మేలు జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. చింత కాయలను నేరుగా తినలేరు. కానీ వీటిని వంటల్లో ఉపయోగించవచ్చు. వీటితో పచ్చడి, సూప్. కూరలు, పులిహోర వంటివి చేసి తినవచ్చు. దీంతో పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

### అధికంగా విటమిన్ సి..

చింతపండులో కన్నా చింతకాయల్లోనే విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. అందువల్ల చింత పండు కాస్త తియ్యగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ కాయ మాత్రం చాలా పుల్లగా ఉంటుంది. అందుకు అందులో ఉండే విటమిన్ సి నే కారణం అని చెప్పవచ్చు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. మహిళలకు చింతకాయలు ఎంతగానో మేలు చేస్తాయి. అందుకనే గర్భంతో ఉన్న మహిళలను చింతకాయలు తినాలని చెబుతుంటారు. వారికి కూడా
ఆ సమయంలో పుల్లగా ఏమైనా తినాలని అనిపిస్తుంది. అందువల్ల
ఆ సమయంలో చింతకాయలను తింటే మేలు జరుగుతుంది.

### మలబద్ధకానికి చెక్..

చింతకాయలను తింటే ఫైబర్ అధికంగా లభిస్తుంది. చింత పండులో ఇది తక్కువగా ఉంటుంది. చింతకాయలను తింటే పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. దీంతో మలబద్ధకం తగ్గిపోతుంది. చింతకాయల్లో కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. ఇవి గ్యాస్, పొట్ట ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. చింతకాయలు సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా కూడా పనిచేస్తాయి. ఎంతటి తీవ్ర మలబద్ధకాన్ని అయినా సరే తగ్గిస్తాయి. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. చింతకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా చింత పండు కన్నా ఆకుపచ్చ రంగులో ఉండే కాయల్లోనే అధికంగా యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. కాయ పండుగా మారే కొద్దీ అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల శాతం తగ్గుతుంది. చింతకాయల్లో ఉండే ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గేలా చేస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

### వాపులు, నొప్పులకు..

చింతకాయల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. చింతకాయల్లో ఉండే సమ్మేళనాలు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఈ కాయల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు షుగర్‌ను నియంత్రిస్తాయి. అందువల్ల డయాబెటిస్
ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ కాయల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తింటే ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి. చింతకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్‌ను సంరక్షిస్తాయి. ఈ కాయల్లో ప్రొ సయనైడిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి లివర్‌లో ఉండే వ్యర్థాలను బయటకు పంపి లివర్‌ను క్లీన్ చేస్తాయి. దీంతో లివర్ పనితీరు మెరుగు పడుతుంది. ఇలా చింతకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. అయితే కొందరికి ఈ కాయలను తింటే గ్యాస్ సమస్య రావచ్చు. అలాంటి వారు చింతకాయలకు దూరంగా ఉండాలి.

# షుగర్, అధిక బరువు సమస్యలతో బాధపడుతున్నారా..? అయితే ఫైబర్ అధికంగా ఉండే ఈ ఆహారాలను తీసుకోండి..!

డయాబెటిస్ తో బాధపడే వారు ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. వారు తీసుకునే ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచేలా, శరీరానికి శక్తిని, పోషకాలను అందించేదిగా ఉండాలి. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉండాలంటే ఎక్కువగా ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచవచ్చు. ప్రాసెస్ చేసిన ఆహారాల లాగా కాకుండా ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా అడ్డుకుంటుంది. గ్లూకోజ్ శోషణ నెమ్మదించేలా చేస్తుంది. ఇక ఫైబర్ లో కూడా కరిగే ఫైబర్, కరగని ఫైబర్ రెండు రకాలు ఉన్నాయి. డయాబెటిస్ ఉన్న వారు రోజుకు 22 నుండి 35 గ్రాముల ఫైబర్ ను తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఫైబర్ ను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది, శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు తీసుకోదగిన ఫైబర్ అధికంగా ఉండే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### అవకాడో, బెర్రీ పండ్లు..

డయాబెటిస్ తో బాధపడే వారు అవకాడోను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. దాదాపు 100గ్రాముల అవకాడోలో 6.7 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఫైబర్ తో పాటు అవకాడోలో ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు కూడా ఉంటాయి. ఈ కొవ్వులు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎంతో సహాయపడతాయి. మధుమేహంతో బాధపడే వారికి అవకాడో ఒక మంచి పండు అని చెప్పవచ్చు. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ వంటి పండ్లల్లో చక్కెరలు తక్కువగా ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. 100గ్రాముల రాస్ప్‌బెర్రీల్లో 6.5 గ్రాముల ఫైబర్ ఉంటుంది. వీటిని



తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అదేవిధంగా పియర్స్ ను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిని తొక్కతో తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు. మధ్యస్థంగా ఉండే ఒక పియర్ పండును తినడం వల్ల దాదాపు 6 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. మధుమేహ నిర్వహణకు ఈ పండు ఎంతో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

### బ్రోకలీ, పచ్చి బఠానీలు..

ఇక డయాబెటిస్ తో బాధపడే వారు బ్రోకలీని కూడా తీసుకోవచ్చు. ఒక కప్పు బ్రోకలీలో 2.2 గ్రాముల ఫైబర్ ఉంటుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా అధికంగా ఉంటాయి. క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కనుక బ్రోకలీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి, శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. పచ్చిబఠాణీల్లో కూడా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఒక కప్పు పచ్చిబఠాణీలలో దాదాపు 8.8 గ్రాముల ఫైబర్ ఉంటుంది. కనుక భోజనంలో వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. అదే విధంగా డయాబెటిస్ ఉన్న వారు ఓట్స్ ను, బార్లీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది గ్లూకోజ్ శోషణను, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక కప్పు ఉడికించిన బార్లీలో 6 గ్రాములు, అరకప్పు ఓట్స్ లో 4 గ్రాముల ఫైబర్ ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. చక్కెర స్థాయిలల్లో వచ్చే హెచ్చుతగ్గులు రాకుండా నివారించవచ్చు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# చిలగడదుంపలను ఇలా తింటున్నారా..? అయితే షుగర్ లెవల్స్ పెరుగుతాయి జాగ్రత్త..!

మన ఆరోగ్యానికి మేలు చేసే దుంప జాతి ఆహారాల్లో చిలగడదుంపలు కూడా ఒకటి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి సహజంగానే తీపి రుచిని కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్ ఎ, విటమిన్ సి, మాంగనీస్ వంటి పోషకాలతో పాటు ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. చిలగడదుంపలను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిని కాల్చుకుని, వేయించి, ఉడికించి అనేక రకాలుగా ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. అయితే వీటిని వండే విధానమే రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుందని నిపుణులు తెలియజేస్తున్నారు. వాటిని ఎక్కువగా ప్రాసెసింగ్ చేయడంతో పాటు కొన్ని వంట పద్దతుల కారణంగా చిలగడదుంపల గ్లైసెమిక్ ఇండెక్స్ పెరుగుతుందని అలాంటి సమయంలో వాటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

### వేయిస్తే చక్కెరతో సమానం..

చిలగడదుంపను వండే విధానం గ్లైసెమిక్ ఇండెక్స్ ను ఏవిధంగా ప్రభావితం చేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. చిలగడదుంపను కాల్చి వంట చేస్తూ ఉంటారు. తొక్క తీసి కాల్చడం వల్ల దీని గ్లైసెమిక్ ఇండెక్స్ 94 వరకు చేరుకుంటుంది. తద్వారా ఇవి అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఆహారాల్లో చేరిపోతాయి. కాల్చిన చిలగడదుంపలతో పాటు తెల్లబియ్యం, బంగాళాదుంపలు వంటి వాటిని కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు మరింత పెరుగుతాయి. కాల్చిన చిలగడదుంపలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ షుగర్ వ్యాధి గ్రస్తులు వీటిని కాల్చి తీసుకోకపోవడమే మంచిది. అలాగే చిలగడదుంపలను వేయించడం కూడా మంచిది కాదు. వేయించడం వల్ల వాటిలో ఉండే స్టార్చ్ నిర్మాణం మారుతుంది. వేయించడం వల్ల ఇవి చక్కెరతో సమానంగా మారిపోతాయి. అంతేకాకుండా వేయించడం



వల్ల నూనె కారణంగా వచ్చే అధిక క్యాలరీలు కూడా శరీరంలోకి వెళ్తాయి. దీంతో ఆరోగ్యప్రయోజనాలు తగ్గుతాయి. రక్తంలో చక్కెర, బరువు పెరిగే అంశాలను దృష్టిలో ఉంచుకుని వీటిని వేయించి తీసుకోకపోవడమే మంచిది.

### ఉడికించి తినడం మంచిది..

చిలగడదుంపలను ఉడికించి తీసుకోవడం అన్నింటి కంటే మంచి పద్దతని నిపుణులు చెబుతున్నారు. ఉడికించడం వల్ల చిలగడదుంపలు సాధారణం నుండి మధ్యస్థ గ్లైసెమిక్ సూచికలోకి వస్తాయి. ఇవి గ్లూకోజ్ స్థాయిలను కూడా ఎక్కువగా ప్రభావితం చేయవు. ఎక్కువ సమయం ఉడికించడం వల్ల వాటి స్టార్చ్ నిర్మాణంలో మార్పులు వస్తాయి. అలాగే ఉడికించడం వల్ల ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. కనుక షుగర్ వ్యాధి గ్రస్తులతో పాటు ఇతరులు కూడా వీటిని ఉడికించి తీసుకోవడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు.
అలాగే వీటిని బేక్ చేసి కూడా తీసుకోవచ్చు. బేక్ చేయడం వల్ల ఇవి మధ్యస్థ గ్లైసెమిక్ సూచికలోకి వస్తాయి. వీటిని ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు లేదా ప్రోటీన్ తో కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. చిలగడదుంపలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికి వీటిని వండే విధానంలో వచ్చే తేడాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయని వైద్యులు చెబుతున్నారు. చిలగడదుంపలను కాల్చి, వేయించి తీసుకోవడానికి బదులుగా ఉడికించి, బేక్ చేసి తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి మరింత మేలు కలుగుతుందని వారు సూచిస్తున్నారు.

# బీసీల ఐక్యతతోనే హక్కులు సాధ్యం

హనుమకొండ, నేటిధాత్రి:
ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (మెపా) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల విజేందర్ ముదిరాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటారని, గతంలో సర్పంచ్ ఎన్నికల్లో ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌ను అధికారికంగా 17.33 శాతంగా ప్రకటించినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా 52 శాతం స్థానాల్లో బీసీలు విజయం సాధించారని తెలిపారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల్లో 62 శాతం బీసీలు గెలవడం బీసీలలో చైతన్యం పెరిగిందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైందన్నారు. గ్రామీణ ప్రాంతం, పట్టణం, రాష్ట్రం, కేంద్రం అనే తేడా లేకుండా మొత్తం 60 శాతం ఉన్న బీసీలు తమ హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. "మేమెంతో మాకంత" అనే నినాదంతో శాంతియుతంగా పోరాటం సాగుతోందన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా ఇదే ఐక్యత కొనసాగించి బీసీలు మరోసారి తమ శక్తిని నిరూపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



-గోనెల విజేందర్ ముదిరాజ్

# నయా నియంతృత్వంలో ట్రంప్



నేటిధాత్రి డెస్క్ :
ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్ధాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ. 12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ. 16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్
టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

# అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వచ్చేలా ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్ హౌస్ వెల్లడించింది. ఇవి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించేందుకు ఓవల్ ఆఫీస్ నుంచి సంతకం చేయడం తనకు చాలా గౌరవంగా ఉందని ట్రూత్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇవి దాదాపు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ విషయంపై అందిరికి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. చట్టపరమైన మరో అధికారాన్ని అమలు చేసే వరకు ఈ కొత్త సుంకం అమల్లో ఉంటుందని వైట్? హౌస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వాములు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ప్రకారం టారిఫ్‌లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. భారత్ 10 శాతం టారిఫ్ చెల్లించాలా అలాగే ఇది గతంలో ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకానమిక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) కింద విధించిన టారిఫ్‌లను భర్తీ చేస్తారా అని ప్రశ్నకు వైట్ హౌస్ అధికారి ఈ మేరకు స్పందించారు. ఈ 10 శాతం గ్లోబల్ టారిఫ్ అనేది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన రక్షణాత్మక వాణిజ్య విధానంలో భాగమని పేర్కొన్నారు. చెల్లింపుల సమతుల్యత లోటును తగ్గించడం, అన్యాయ వాణిజ్య విధానాలను పరిష్కరించే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు కొనుగోళ్లను భారత్ తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని తెలిపారు. వైట్ హౌస్‌లో అమెరికా సుప్రీంకోర్టు తను విధించిన టారిఫ్‌లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక భారత్‌తో ట్రేడ్ డీల్ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొత్త చట్టపరమైన మార్గాల ద్వారా కొనసాగుతాయని సంకేతాలు ఇచ్చారు.

ఇదిలా ఉండగా, సుంకాలతో భారత్- పాక్ యుద్ధాన్ని పరిష్కరించినట్లు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను పరిష్కరించిన 8 యుద్ధాల్లో 5 యుద్ధాలను టారిఫ్‌ల ద్వారా ముగించాను. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను 8 యుద్ధాలను ముగించాను. అందులో భారత్-పాకిస్థాన్ వంటి అణు యుద్ధానికి దారితీసే పెద్ద వివాదాలు కూడా ఉన్నాయి. గురువారం జరిగిన పీస్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్ల 3.5 కోట్ల ప్రాణాలు కాపాడారని అన్నారు. వారు చాలా ప్రమాదకర చర్యలకు సిద్ధమవుతున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్-పాక్ ఘర్షణ సమయంలో 10 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లు ట్రంప్ తెలిపారు. గురువారం 11 విమానాలు కూల్చివేశారని చెప్పిన ఆయన, ఇప్పుడు సంఖ్యను 10కి తగ్గించారు. ఆ యుద్ధం అణు యుద్ధానికి దారితీసేలా సాగుతోందని అన్నారు. దానిని టారిఫ్‌ల ద్వారానే ఆపినట్లు చెప్పారు. ఇరు దేశాలకు యుద్ధం చేయాలనుకుంటే చేయండని, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు తేల్చి చెప్పాను. ప్రతి దేశంపై 200 శాతం టారిఫ్ విధిస్తాను హెచ్చరించాను. దీంతో ఇరుదేశాలు ఫోన్ చేసి విరమణ ఒప్పందానికి వచ్చినట్లు చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు.
మరోవైపు తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను. పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు. సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా? అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.

# ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశ రాజధాని దిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(రామ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో దిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్?ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం దిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

# ప్రధాని నివాసం కోసం మురికివాడల ఖాళీ

- ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు
- దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు జారీ



**న్యూఢిల్లీ, నేటిధాత్రి:**
దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి వాడల్లో నివాసముంటున్న కుటుంబాలపై పడింది. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారిని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు పంపింది. అక్కడి నుంచి ఖాళీ చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు అందాయని తెలుస్తున్నది. అయితే కచ్చితమైన గడువు తేదీని పేర్కొనకపోవడం, పునరావాసంపై ఎలాంటి స్పష్టతా లేకపోవడంతో అక్కడి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని నూతన నివాసం నిర్మాణం నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులు వచ్చినట్టు అంతా భావిస్తున్నారు. రేస్‌కోర్స్ రోడ్ వెంట ఉన్న భాయిరామ్ క్యాంప్, మస్జీద్ క్యాంప్, డిఐడి క్యాంప్ నివాసితులకు ఈ నోటీసులు అందినట్టు సమాచారం. నోటీసులో ఆ భూమిని ప్రభుత్వానికి చెందినదనీ, ఇకపై అక్కడ నివసించడం అనధికారికంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదేశాలను పాటించకపోతే చట్ట ప్రకారం అక్కడి నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. ఈ నోటీసుతో అక్కడి స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చాలా మంది నిరుపేదల అక్కడ నివసిస్తూ సమీప ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. ఖాళీ చేయాల్సిన గడువు, పునరావాసం, ప్రత్యామ్నాయాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని వారు అంటున్నారు. కాగా వారు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి.. పునరావాసంపై స్పష్టత కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఈ చర్యలు రాజధాని సెంట్రల్ జోన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు.

# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

## అంతర్జాతీయ పరిణామాలతో పైపైకి..

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ. 1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ. 880, 22 క్యారెట్లపై రూ. 800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,57,520 ఉండగా, ముంబైలో రూ. 1,57,370,



చెన్నైలో రూ. 1,57,300గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచం లోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

# ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ. 12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణి స్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

# ప్రధాని మోదీ రాజీపడ్డారు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
అమెరికా విధించిన సుంకాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికాతో ఏకపక్ష, భారత వ్యతిరేక వాణిజ్య ఒప్పందం చేసేందుకు కేంద్రం తొందరపడిందని ఆరోపించింది. తొందరపాటు అనేది దెయ్యం పని అని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా విమర్శలు గుప్పించారు. ఫిబ్రవరి 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, వాషింగ్టన్‌కు అర్థరాత్రి ఫోన్ కాల్ ఎందుకు చేశారని నిలదీశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ గ్లోబల్ టారిఫ్‌లను రద్దు చేసింది. భారత్ మరో 18 రోజులు వేచి చూసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఫిబ్రవరి 2న వాషింగ్టన్‌కు అర్థరాత్రి కాల్ ఎందుకు సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఎందుకు ఆగలేదు జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే ప్రకటనలే కారణమా జెఫ్రీ ఎఫ్ స్టీన్ ఫైల్ల ప్రభావమా గౌతమ్ అదానీకి సంబంధించిన అమెరికా క్రిమినల్ కేసా లేక ఇవన్నీ కారణాలా ఈ రోజు కాంగ్రెస్ వాదన సత్యమైంది. ప్రధాని నరేంద్ర మోదీ రాజీ పడ్డారు' అని పవన్ ఖేడా ఆరోపించారు. అమెరికాతో కుదిరిన ఏకపక్ష వాణిజ్య ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం పునఃసమీక్షించాలని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాల్ అన్నారు. అమెరికా కొత్తగా ప్రతిపాదించిన సుంకాల స్థిరత్వం, భారత్‌పై వాటి వర్తింపును ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. '1977లో అమల్లోకి వచ్చిన ఐఈఈపీఏ కింద అధ్యక్షుడికి టారిఫ్‌లు విధించే అధికారం లేదని అమెరికా సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122, 1962 ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్ సెక్షన్ 232, 1974 ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింద ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్‌లు భారత్‌కు వర్తించవని కనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, ఈ సుంకాలు భారత్‌పై చట్టబద్ధంగా అమలవుతాయా అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం నిలబడుతుందా రైతులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులు, ఇంధన, డేటా నిపుణులు, ఆర్థికవేత్తలు వ్యతిరేకిస్తున్న ఈ ఒప్పందం నుంచి బయటకు రావడానికి మోదీ ప్రభుత్వం ధైర్యం చేస్తుందా' అని సుర్జేవాలా ప్రశ్నించారు. సెక్షన్ 122 (ట్రేడ్ యాక్ట్, 1974) ప్రకారం 150 రోజులపాటు మాత్రమే 10శాతం టారిఫ్ విధించవచ్చని సుర్జేవాలా తెలిపారు. తరువాత అమెరికా కాంగ్రెస్ ఆమోదం అవసరమని, ఇది తాత్కాలిక చర్య మాత్రమే అని అన్నారు. ఇక సెక్షన్ 232 (ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్, 1962) -- జాతీయ భద్రతా కారణాలతో మాత్రమే టారిఫ్ విధించాలని పేర్కొన్నారు. 270 రోజుల్లో అమెరికా వాణిజ్య శాఖ సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. భారత ఎగుమతులు జాతీయ భద్రతకు ముప్పు కాదని వివరించారు. అలాగే సెక్షన్ 301 (ట్రేడ్ యాక్ట్, 1974) -- సంబంధిత దేశం అన్యాయ వాణిజ్య పద్ధతులు అనుసరించిందని దర్యాప్తు ద్వారా నిరూపించాలని చెప్పారు. భారత్‌పై అలాంటి దర్యాప్తు జరగలేదని ఆయన వివరించారు. ఇప్పుడు జాతీయ ప్రయోజనాలను రక్షించడానికి ప్రభుత్వం సిద్ధమా అని సుర్జేవాలా ప్రశ్నించారు. ట్రంప్ సుంకాలను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ప్రశంసించారు. ట్రంప్ మొత్తం టారిఫ్ వ్యూహాన్ని కొట్టివేసిన అమెరికా సుప్రీంకోర్టుకు అభినందనలు తెలిపారు. కోర్టు భావజాల పరమైన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుంటే 6-3 తీర్పు అద్భుతమైన, స్పష్టమైన నిర్ణయని పేర్కొన్నారు. అంతేకాకుండా. అమెరికా చెక్స్ అండ్ బాలెన్సెస్ వ్యవస్థ ఇంకా పనిచేస్తుందని చురకలేశారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, అమెరికా 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ను అమలు చేసింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రకారం భారత్ కూడా ఈ టారిఫ్ చెల్లించాల్సి ఉంటుందని వైట్?హౌస్ స్పష్టం చేసింది. ఇక సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రపంచ వాణిజ్యం, వ్యాపార సంస్థలు, వినియోగదారులు, ద్రవ్యోల్బణ ధోరణులు, గృహ ఆర్థిక పరిస్థితులపై విస్తృత ప్రభావం చూపే అవకాశముంది.

# మీరే నాకు జీతం ఇస్తున్నారు సార్..

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఓ యూట్యూబర్ కు సర్ ప్రైజ్ ఎదురైంది. ఏకంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ పక్కన కూచునే అవకాశం దక్కింది. తన సీటుకు రెండు సీట్ల అవతల ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి కూర్చోవడంతో ఆ యూట్యూబర్ సంతోషం మామూలుగా లేదు. తిన్నగా ఆయన వద్దకు వెళ్లి 'నమస్తే సార్.. మీరే నాకు నెలనెలా డబ్బులు ఇస్తున్నారు' అంటూ పలకరించాడు. దీనికి ఆశ్చర్యపోయిన సుందర్ పిచాయ్.. అదెలాగని ప్రశ్నించగా తానో యూట్యూబర్ నని, నెలనెలా యూట్యూబ్ నుంచి ఆదాయం పొందుతున్నానని చెప్పడంతో ఆయన కూడా నవ్వేశారు. అనంత్ లధా అనే యూట్యూబర్ కు ఎదురైందీ అనుభవం. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ వేదికగా పంచుకోవడంతో ఆ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చార్టర్డ్ అకౌంటెంట్ నుంచి యూట్యూబర్ గా మారిన అనంత్ లధా..



'ఇన్వెస్ట్ ఆజ్ ఫర్ కల్' అనే ప్లాట్‌ఫారమ్ నడుపుతున్నారు. ఏఐ సదస్సులో సుందర్ పిచాయ్‌తో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేస్తూ తన 'ఫ్యాన్ బాయ్' మూమెంట్ గురించి ఎక్స్ లో పోస్ట్ చేశారు. సదస్సులో సుందర్ పిచాయ్ పక్కనే కూర్చునే అవకాశం రావడంతో అనంత్ ఆయనతో మాటలు కలిపానని చెప్పారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు సుందర్ పిచాయ్ సింప్లిసిటీని మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. "బిజీ షెడ్యూల్ లోనూ సామాన్య వ్యక్తులతో ఆయన మాట్లాడే విధానం అద్భుతం" అని ఒకరు, "తర్వాతి వంతు జుకర్ బర్గ్ లేదా ఎలాన్ మస్క్ అనుకుంటా.. వారు కూడా మీకు డబ్బులు ఇస్తారుగా!" అంటూ మరొక నెటిజన్ చమత్కరించారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ

**●దర్శనానికి 18 నుంచి 20 గంటలు ●వేసవి రద్దీకి అనుగుణంగా టిటిడి ప్రణాళిక**

**తిరుమల, నేటిధాత్రి:**
తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. దీంతో స్వామి వారి సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. కాగా శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. ఇదిలావుంటే త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవులకు రానున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. గత రెండు,మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.
భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు ఈవో తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, గంటల వారీగా ఇన్?అవుట్ క్యూలో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపాట్‌మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని వివరించారు. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999